
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

గుంటూరు జిల్లా వార్తలు


5

సోమవారం 9 సెప్టెంబరు 2024




సత్తెనపల్లిలోని నాగార్జున నగర్‌లో 61 అడుగుల మట్టి వినాయకుడి విగ్రహం













గుంటూరు: నల్లచెరువులో విఘ్నేశ్వర యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణనాథుడు

గుంటూరు: శ్రీనగర్ ఏడవ లైనులో...

గుంటూరు:శ్రీ గణేష్ యూత్ ఆధ్వర్యంలో శ్రీనగర్ 7/2 లో..

పొన్నూరు: నిడుబ్రోలులో మట్టి గణనాథుడు

తెనాలి: గంగానమ్మపేటలో బంకమట్టితో గడ్డి వినాయకుడు

దండాలయ్యా.. ఉండ్రాలయ్యా

- భక్తిశ్రద్ధలతో చవితి ఉత్సవాలు
- వాడవాడలా కొలువుదీరిన గణనాథులు
- సత్తెనపల్లిలో 61 అడుగుల మట్టి గణపతికి పూజలు

గుంటూరు, నరసరావుపేట, బాపట్ల, సెప్టెంబరు 8: దండాలయ్యా.. ఉండ్రాలయ్యా. జై బోలో.. గణేష్ మహరాజ్‌కూ జై.. గణపతి బప్పా మోరియా, జై గణేశా.. జై జై గణేశా నినాదాలు హోరెత్తగా.. ప్రత్యేకంగా అలంకరించిన మండపాల్లో వివిధ రూపాల్లో గణనాథులు భక్తులకు దర్శనమిచ్చారు. చవితి సందర్భంగా గణనాథులను దర్శించుకుని భక్తులు భక్తిపారవశ్యం లో మునిగితేలారు. జిల్లావ్యాప్తంగా శనివారం ఇంటింటా, వాడ వాడలా చవితి వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. వీధివీధిన ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుని ప్రతిమలు, ఇంటింటా కొలువుదీరిన బొజ్జ గణపయ్య వేడుకలతో జిల్లా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఉదయం నుంచే అన్ని ప్రాంతాల్లో చవితి సందడి నెలకొంది. వినాయక చవితి పర్వదినాన్ని ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. వాడవాడలా విభిన్న రూపాల్లో ప్రతిష్ఠించిన గణనాథులకు ప్రత్యేక పూజలు జరిపారు. ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన పందిళ్లలో ఏర్పాటు చేసిన గణనాథులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చవితి రోజున అనేక ప్రాంతాల్లో వివిధ సంఘాల ఆధ్వర్యంలో భక్తులకు ఉచితంగా మట్టి గణనాథుల ప్రతిమలను పంపిణీ చేశారు.. వీధి వీధినా ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన మండపాలలో భారీ వినాయక విగ్రహాల వద్ద ప్రత్యేక పూజాది క్రతువులను నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన మండపాల్లో ప్రతిష్ఠించిన గణనాథులకు వేద పండితులు మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండపాల వద్ద వేదపఠనం, భక్త బృందాల భజనలతో సందడి నెలకొంది. భక్తులు పెద్ద సంఖ్యలో వేడుకల్లో పాల్గొని మొక్కు లు తీర్చుకున్నారు. కాలనీల్లో, అపార్టుమెంట్లలో, వీధివీధిన ఏర్పాటు చేసిన విగ్రహాలు అకట్టుకున్నాయి. వీటిని తిలకించేందుకు పిల్లలు, పెద్దలు బారులు తీరారు. కొన్ని ప్రాంతాల్లో వర్షం భక్తుల సందర్శనకు ఆటంకంగా మారింది. మరో వైపు ఆలయాల వద్ద చవితి పండుగ శోభ సంతరించుకుంది. స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు బారు లు తీరారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. గణేశ్ మండపాల వద్ద రెండో రోజు ఆదివారం నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండపాల్లో గణనాథులను దర్శించుకునేందుకు వచ్చిన వారికి ప్రత్యేకంగా ప్రసాదాలను పంపిణీ చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఆదివారం పలుచోట్ల గణపతి విగ్రహాలను నిమజ్జనోత్సవానికి తరలించారు.

- సత్తెనపల్లి నాగార్జుననగర్‌లో శ్రీసత్యసాయి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 61 అడుగుల మట్టి వినాయకుడి ప్రతిమకు ప్రత్యేక పూజలు జరిగాయి. పర్యావరణ హితంగా ఏర్పాటు చేసిన ఈ వినాయకుడు భక్తుల నుంచి పూజలు అందుకుంటున్నారు. బంక మట్టి, వెదురు, వరి పొట్టుతో నెల రోజులు కార్మికులు వినూత్నంగా రూపొందించిన మట్టి గణపతి విగ్రహం భక్తులను విశేషంగా ఆకర్షిస్తోంది. వినాయక నిమజ్జనానికి వచ్చే సమయంలో నిర్వాహక కమిటీలు సురక్షితంగా కార్యక్రమాన్ని ముగించుకునేలా పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సతీష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. తెనాలి మండలంలోని సంగంజాగర్లమూడి కొమ్ము మూరు కాలువ లాకుల ప్రాంతాన్ని ఎస్పీ పరిశీలించి అధికారులకు ప్రత్యేక సూచనలు చేశారు.
- తెనాలి గంగానమ్మపేటలో గణేష్ మెడికల్ కమిటీ ఆధ్వర్యంలో కోల్‌కతా నుంచి తెప్పించిన బంకమట్టితో పచ్చిగడ్డి మొలిచేలా వినాయకుడి ప్రతిమను ఏర్పాటు చేశారు. దీనిపై రోజూ నీరు చల్లుతూ ఉంటే ఎన్ని రోజులైనా గడ్డి వినాయకుడి లాగానే కనిపిస్తుంది. ఇక పట్టణంలో ఏర్పాటు చేసిన పలు వినాయక విగ్రహాలను దర్శించుకున్న మంత్రి నాదెండ్ల మనోహర్ ఆయా పందిళ్ల వద్ద జరిగిన పూజల్లో పాల్గొన్నారు.
- బాపట్ల ఏఆర్ కార్యాలయంలో పోలీసులు ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమ వద్ద ఎస్పీ తుషార్‌డూడీ దంపతులు పూజలు నిర్వహించారు.

మళ్లీ.. వరద ముప్పు



చెరుకుపల్లి మండలం గూడవల్లి పంచాయతీ పాంచాలవరం రోడ్డులో నీటమునిగిన వేలాది ఎకరాల పంటపొలం

- నాగార్జున సాగర్ నుంచి నీటి విడుదల
- ప్రకాశం బ్యారేజి వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక
- ప్రభావిత గ్రామాలను అప్రమత్తం చేస్తున్న అధికారులు
- పునరావాస కేంద్రాలకు రావాలని లంక గ్రామాల్లో దండోరా
- పది రోజులుగా పొలాల్లో తగ్గని నీరు.. నీటిలోనే 13 వేల ఎకరాలు



వరద ముంపు నుంచి బయట పడి కుళ్లిపోయిన పసుపు పైరు



కొల్లూరు: వరద ముంపులోనే పసుపు పైరు



కొల్లూరు: దోనేపూడి వద్ద చప్టాపై ప్రవహిస్తున్న వరద నీరు



అమర్తలూరు మండలంలో పంటపొలాల గట్లపై నుంచి వెళుతున్న నీరు.. మునిగిన పొలాలు

బాపట్ల, రేపల్లె, సెప్టెంబరు 8: కృష్ణమ్మ మళ్లీ కన్నెర్ర చేస్తోంది. భారీ వర్షాలతో ఉధృతంగా ప్రవహించి ఇటీవలే శాంతించింది.. అనుకునేంతలో మళ్లీ వరద పోటెత్తుతోంది. వారం రోజుల క్రితం ఉగ్రరూపం దాల్చిన కృష్ణానది తీర ప్రాంతాలను ముంపునకు గురి చేసింది. నదీ తీర గ్రామాలు, లంకలు ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నాయి. ఇంతలోనే రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో వరద ఉధృతి క్రమేపీ పెరుగుతోంది. దీంతో ఆదివారం శ్రీశైలంతో పాటు నాగార్జున జలాశయం, ప్రకాశం బ్యారేజీల గేట్లు ఎత్తి నీటిని విడుదల చేశారు. ఈ క్రమంలో దిగువ ప్రాంతాల వారిని అధికారులు అప్రమత్తం చేశారు. నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ 24 క్రస్ట్ గేట్ల ద్వారా ఆదివారం అధికారులు నీటిని విడుదల చేశారు. 20 గేట్లను 5 అడుగులు, 4 గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 2,18,300 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ప్రకాశం బ్యారేజి వద్ద మళ్లీ వరద ఉధృతి పెరుగుతోంది. ఆదివారం సాయంత్రానికి 4 లక్షల 56వేల 602 క్యూసెక్కుల వరద నీరు బ్యారేజి వద్దకు చేరుతున్నట్టు సమాచారం. బ్యారేజికి వరద పెరగడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. దిగువ నది ప్రాంతవాసులు, లంక భూముల రైతులు అందరూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. బ్యారేజీ నుంచి నీటిని దిగువకు విడుదల చేస్తుండటంతో కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లోని లంక గ్రామాలు మళ్లీ వరద గుప్పెట్లో చిక్కుకోనున్నాయి. బాపట్ల కలెక్టర్ వెంకటమురళి ఆదేశాలతో అధికార యంత్రాంగం అప్రమత్తమై వరద హెచ్చరికలు జారీ చేసింది. కొల్లూరు మండల పరిధిలోని లంక గ్రామాల్లో జేసీ ప్రఖర్‌జైన్, ఆర్డీవో హేలాషారోన్‌లతో కలిసి కలెక్టర్ జె.వెంకటమురళి పర్యటించారు. అరవింద వారధి వద్ద ప్రవాహాన్ని పరిశీలించారు. కొల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. నదికి వరద ప్రవాహం 5.5 లక్షల క్యూసెక్కులతో చేరుకోవడంతో 2వ ప్రమాద హెచ్చరికను జారీ చేసినట్లు ప్రకటించారు. అధికారులంతా గత వారంలో చేసిన విధంగానే యథావిధిగా విధుల్లో కొనసాగాలన్నారు. లంక గ్రామాల్లోని ప్రజలు పునరావాస కేంద్రాలకు తరలి రావాలని మైకుల ద్వారా సిబ్బంది దండోరా చేశారు. ఇప్పటికే చిలుమూరు, కొల్లూరు, దోనేపూడి, భట్టిప్రోలు మండలంలోని వెల్లటూరు, ఓలేరు వద్ద ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో సహాయ చర్యలకు అన్ని సిద్ధం చేస్తున్నట్లు అధికారులు చెప్పారు. బ్యారేజీకి ఎగువ ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో ఆదివారం రాత్రికి బ్యారేజీ దగ్గర వరద ఉధృతి మరింత పెరగనుందనే అంచనాలు నదీ పరీవాహక ప్రాంతాల ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పెనుమూడికి వరదపోటు రానున్నదని అధికారులు అంచనా వేస్తున్నారు. అర్ధరాత్రికి వరద పెరిగే పరిస్థితి ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరారు. ఇప్పటికే వాణిజ్య పంటలు తుడిచిపెట్టుకుపోగా మళ్లీ వరద ముంచెత్తుతుందనే హెచ్చరికలతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఇప్పటికే వాణిజ్య పంటలు రోజుకో విధంగా రూపురేఖలు కోల్పోయి కుళ్లిపోతున్నాయి. భారీ వరదతో అన్నీ కోల్పోయినా ఇంకా కృష్ణమ్మ తమను కనికరించడం లేదంటూ ఆవేదన చెందుతున్నారు. తీర గ్రామాల్లో వరి పొలాల్లో నీరు తిష్ఠ వేసి ఉంది. రేపల్లె, వేమూరు నియోజకవర్గాల్లో 13 వేల ఎకరాలుపైనే నీటిలోనే ఇంకా నానుతున్నాయి.

డీసీసీల నియామకం

- గుంటూరుకు చిలకా విజయ్‌కుమార్
- బాపట్ల జిల్లాకు మాజీ ఎమ్మెల్యే ఆమంచి
- పల్నాడు బాధ్యతలు మళ్లీ అలెగ్జాండర్ సుధాకర్‌కే
- ఏపీసీసీలో జిల్లా నేతలు పలువురికి దక్కిన పదవులు

గుంటూరు, సెప్టెంబరు 8: కాంగ్రెస్‌లో పదవుల పందేరం జరిగింది. ఇటీవల ఏఐసీసీ పీసీసీతో పాటు జిల్లా కాంగ్రెస్ కమిటీలను రద్దుచేసింది. ఈ క్రమంలో ఆ పార్టీ జిల్లాల అధ్యక్షులను నియమిస్తూ అధిష్ఠానం శనివారం ఉత్తర్వులను జారీచేసింది. ఉమ్మడి జిల్లాలోని మూడు జిల్లాలకు కొత్త అధ్యక్షులను నియమించారు. కాంగ్రెస్ గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా తాడికొండకు చెందిన చిలకా విజయ్‌కుమార్‌ను నియమించింది. ఈయన తాడికొండ నియోజకవర్గం నుంచి గత ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. అలానే ప్రస్తుతం పల్నాడు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడుగా ఉన్న అలెగ్జాండర్ సుధాకర్‌కు మరోసారి జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించారు. బాపట్ల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడుగా చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్‌ను నియమించారు. ఇప్పటి వరకు బాపట్ల జిల్లా అధ్యక్షుడుగా ఉన్న గంటా అంజిబాబును ఆ బాధ్యతల నుంచి తప్పించి ఏపీసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఇక ఏపీసీసీ కమిటీలోనూ ఉమ్మడి గుంటూరు జిల్లా నేతలు పలువురికి స్థానం దక్కింది. ఏపీసీసీ ప్రధాన కార్యదర్శిగా వరుసగా మూడో సారి ప్రత్తిపాడు నియోజక వర్గానికి చెందిన మదన మోహన్‌రెడ్డికి స్థానం దక్కింది. ఏపీసీసీ ప్రధాన కార్యదర్శులుగా కారుమంచి రమాదేవి, గడ్డం పాల్ విజయ్‌కుమార్, ఏపీసీసీ ఉపాధ్యక్షులుగా కొరివి వినయ్‌కుమార్, ఎమ్ సూర్యానాయక్‌లు ఉన్నారు. మొన్నటి వరకు ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వ్యవహరించిన మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్‌వలికి ఏఐసీసీలో చోటు దక్కే అవకాశం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి.



చిలకా విజయ్‌కుమార్



అలెగ్జాండర్ సుధాకర్



ఆమంచి కృష్ణమోహన్

రహదారులు.. ఛిద్రం

- వర్షాలకు కొట్టుకుపోయిన రోడ్లు
- డైవర్షన్ల వద్ద నిలిచిన రాకపోకలు
- ప్రధాన మార్గాలూ గుంతలమయం
- ఇబ్బందులు పడుతున్న వాహన చోదకులు

ఆంధ్రజ్యోతి - న్యూస్‌నెట్‌వర్క్, సెప్టెంబరు 8: రహదారులు అధ్వానం.. ప్రయాణం నరకం. అసలే అంతంతమాత్రంగా ఉన్న రోడ్లను వర్షాలు, వరదలు ధ్వంసం చేశాయి. పది రోజుల నుంచి కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా చాలాప్రాంతాల్లో రోడ్లు కొట్టుకుపోయాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తుండటంతో చప్టాలు గోతులమయంగా మారగా, డైవర్షన్ రోడ్లు కొట్టుకుపోయాయి. మరికొన్ని దగ్గర్ల కోతకు గురయ్యాయి. గోతులు, గుంతలతో నిండిపోయిన రోడ్ల రాకపోకలకు వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఐదేళ్లుగా సరైన నిర్వహణ లేని రోడ్లను తాజా వర్షాలు అధ్వానంగా మార్చాయి. గుంటూరుతో పాటు జిల్లాకేంద్రాలైన బాపట్ల, నరసరావుపేటల్లో సైతం రోడ్లు గోతులతో నిండి ఉన్నాయి. ప్రధాన రోడ్లు కూడా వర్షాల తాకిడికి గుంతలు పడి తారు, సిమెంటు లేచి పోయి రాళ్లు బయట పడి వాహనదారులతో పాటు పాదచారులు ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్లపై ఏర్పడిన భారీ గుంతల్లో వర్షపు నీరు నిలిచి తటాకాలను తలపిస్తున్నాయి. ఎక్కడ గొయ్యి ఉందో ఎక్కడ మెరక ఉందో అర్థం కాని పరిస్థితి. గోతులలో నీరు చేరడంతో వాహనాలపై వాహన చోదకులు ప్రమాదాల బారిన పడి గాయాలపాలవుతున్నారు. మరికొన్నిచోట్ల రోడ్డుపై వేసిన తారు లేచిపోయి అడుగున రాళ్లు బయటపడటంతో వాహనాలు దెబ్బతింటున్నాయి. రాత్రుళ్లు గోతులు అర్థం కాక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. నియోజకవర్గ కేంద్రాలు, మండలాల్లోని ఆర్అండ్‌బీ, పంచాయతీ రోడ్లు అధ్వానంగా మారాయి. లో లెవల్ చప్టాలపై వర్షపు నీరు ఉధృతంగా ప్రవహించడంతో రోడ్లు కోతలకు గురయ్యాయి. భారీ వర్షాలతో పలుచోట్ల వంతెనలు, చప్టాలు దెబ్బతిన్నాయి. పలు ప్రాంతాల్లో డైవర్షన్ రోడ్లు అయితే చాలావరకు కొట్టుకుపోయి.. ఆయా మార్గాల్లో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ రహదారులు ప్రయాణికులకు నరకం చూపిస్తున్నాయి. ఒక గ్రామం నుంచి మరొక గ్రామానికి ప్రజలు ప్రయాణం చేయాలంటే కత్తిమీద సాములా మారింది.

- తెనాలి నుంచి నారాకోడూరు, కాజీపేట మీదగా గుంటూరు, తెనాలి నుంచి కూచిపూడి, తెనాలి నుంచి మంగళగిరి రోడ్లు గుంతలయంగా మారాయి. అంగలకుదురు - సంగంజాగర్లమూడి రోడ్డు సగభాగం కోతకు గురై ప్రమాదకరంగా మారింది. నందివెలుగు - కొలకలూరు ఫ్లైఓవర్ సమీపంలోని రోడ్డు అడుగుకోక గుంతగా ఏర్పడింది.
- మంగళగిరి పట్టణంలో అంతర్గత రహదార్లు అధ్వానంగా తయారయ్యాయి. చినకాకాని ఎన్నారై వద్ద గౌతమబుద్ధ రోడ్డు కోతగురైంది. తెనాలి రోడ్డులో ఇండోర్ స్విమ్మింగ్ పూల్ ఎదురుగా రహదారి గుంతలమయమైంది.
- తాడికొండ మార్గంలో కొండవీటి వాగు ఉధృతంగా ప్రవహించడంతో గుంటూరు-అమరావతి రహదారిలో రాకపోకలు నిలిచపోయాయి. పొన్నెకల్లు-దామరపల్లి ప్రధాన రహదారి తటాకాన్ని తలపిస్తుంది. లాం-దామరపల్లి, పొన్నెకల్లులోని లోలెవల్ చప్టాలు కొట్టుపోయి ప్రమాద భరితంగా మారాయి. తాడికొండ-కంతేరు మధ్య ఎర్రవాగు లోలెవల్ చప్టాకి ఇరువైపుల ఉన్న తారురోడ్డు కొట్టుపోయింది. సుమారు అర కిలోమీటర మేర రోడ్డు కోతలు పడి 20 ఏళ్ల క్రిత్రం వేసిన రోడ్డు బయటపడింది.
- కృష్ణానదికి వచ్చిన వరదతో భట్టిప్రోలు, కొల్లూరు మండలాల్లోని 22 లంక గ్రామాల్లో రహదారులు కొట్టుకుపోయాయి. కొల్లూరు కరకట్ట దిగువ నుంచి ఆవులవారిపాలెం వరకు ఆర్ అండ్ బీ రోడ్డు వరద ఉధృతికి కొట్టుకుపోగా ముఖ్యమంత్రి పర్యటన ఉంటుందని తాత్కాలిక మరమ్మతులు చేశారు.
- పిట్టలవానిపాలెం మండలం చందోలు నుంచి సంగుపాలెం కోడూరు మీదగా పొన్నూరు వెళ్లే మార్గాల్లో రోడ్డెక్కడో గుంతలు ఎక్కడో అన్నచందంగా పరిస్థితి మారింది. చందోలు-పొన్నూరు రహదారిపై చీకట్లో ప్రయాణం ప్రాణసంకటంగా మారిందని ప్రయాణికులు గగ్గోలుపెడుతున్నారు.
- బాపట్ల మండలం పడమర బాపట్ల పంచాయతీ నాగేంద్రపురం వెళ్ళేరోడ్డుతోపాటు పోతురాజు కొత్తపాలెం ప్రధాన రహదారి గుంతల మయంగా మారింది. ఈతేరు గ్రామం నుంచి గుడిపూడి మీదగా కర్లపాలెం వెళ్ళేరోడ్డుపై ప్రయాణం నరకయాతనగా ఉంటుందని వాహనచోదకులు వాపోతున్నారు. కర్లపాలెం మండలం పెదగొల్లపాలెంలో బీటీ రోడ్డు దెబ్బతింది.
- రేపల్లె నియోజకవర్గంలోని నల్లూరుపాలెం, పోటుమెరక, తుమ్మల, కట్టవ, మృత్యుంజయపాలెం, గంగడిపాలెం, చెన్నువారిపాలెం, లంకేవానిదిబ్బ వరకు రహదారుల్లో గుంతలు ఏర్పడ్డాయి. పెనుమూడి నుంచి రావిఅనంతవరం, ఓలేరు, పెద్దపులివర్రు వరకు రహదారి దెబ్బతింది. రేపల్లెలోని పెనుమూడి రోడ్డు, బేతపూడి అడ్డరోడ్డు నుంచి గుడ్డికాయలంక లాకుల వరకు బేతపూడి అడ్డరోడ్డు నుంచి సజ్జావారిపాలెం వరకు రహదారంతా ప్రమాదభరితంగా మారింది. సజ్జావారిపాలెం నుంచి శింగుపాలెం, పల్లపట్ల, పల్లమెరక, అడవులదీవి రహదారి పూర్తిగా దెబ్బతింది.



గుంటూరు: పట్టాభిపురం రోడ్డు దుస్థితి



చుట్టుగుంట-లాలూపురం వెళ్లే రహదారి



మంగళగిరి గోలి వారి వీధిలో రెండు అడుగుల మేర ఏర్పడిన గుంతలు



తెనాలి: కొలకలూరు సెంటర్ వద్ద గుంతలమయంగా రోడ్డు



తెనాలి: సంగంజాగర్లమూడి - గురువుపాలెం గుంతలు తేలిన ప్రధాన రోడ్డుపై వాహనదారుల అవస్థలు



గుంటూరు: మార్కెట్ దగ్గరలోని వెస్ట్ పారిస్ చర్చి ఎదురు



గుంటూరు: నల్లపాడు నుంచి బైపాస్‌కు ఇన్నర్ రింగ్ రోడ్డు

మాన్యువల్ స్కావెంజర్ రహిత జిల్లాగా గుంటూరు

గుంటూరు (విద్య), సెప్టెంబరు 8: ఉమ్మడి గుంటూరు జిల్లాను మాన్యువల్ స్కావెంజర్ రహిత జిల్లాగా ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వం, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మున్సిపల్, పంచాయతీ అధికారులు మాన్యువల్ స్కావెంజర్స్, సెప్టిక్ ట్యాంక్‌లేని మరుగుదొడ్ల పై విస్తృత సర్వే నిర్వహించారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ఎక్కడా కూడా మాన్యువల్ స్కావెంజర్స్, (చేతులతో మల, మూత్రాలు శుభ్రం చేసే విధానం) సెప్టిక్ ట్యాంక్ లేని మరుగుదొడ్లు లేవని ఆగస్టు 14 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించిన సర్వేలో తేల్చారు. జిల్లాలో ఎక్కడైనా ఇటువంటి పరిస్థితి ఉంటే సాంఘిక సంక్షేమ శాఖ సాధికారిక సంస్థకు ఫిర్యాదు చేయాలని డిప్యూటీ డైరెక్టర్ డి.మధుసూదన్‌రావు విజ్ఞప్తి చేశారు. ఫిర్యాదుదారులు సెప్టెంబర్ 9 నుంచి 15లోగా సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయం ఆవరణలోని సాధికారిక సంస్థలో ఫిర్యాదు చేయాలని సూచించారు.

వైసీపీ ఎంపీటీసీ మెంబర్‌పై చోరీ కేసు

పొన్నూరుటౌన్, సెప్టెంబరు 8: పొన్నూరు మండలం మన్నవ గ్రామ వైసీసీ ఎంపీటీసీ మెంబర్ బొనిగల అమరేంద్ర ప్రసాద్‌పై చోరీ కేసును రూరల్ పోలీసులు నమోదు చేశారు.రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మన్నవ గ్రామ కార్యదర్శి పి.రవిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. పంచాయతీకి సంబంధించిన స్టాక్ రూమ్ తాళాలు పగలకొట్టి అక్రమంగా ప్రవేశించటమే కాకుండా పంచాయతీకి సంబంధించిన వస్తు సామగ్రి చోరీ చేసినట్లు కార్యదర్శి ఫిర్యాదులో పేర్కొన్నారు. పంచాయతీకి చెందిన మోటార్లు, ఫాగింగ్ మిషన్, స్ప్రేయర్లు, బ్లీచింగ్, సున్నం, విద్యుత్ పరికరాలు, మొక్కలకు సరఫరా అయిన వంద బస్తాల ఎరువు, రిక్షా వంటి వాహనంతోపాటు రూ. 5 లక్షలు విలువ కలిగిన వస్తువులను అమరేంద్ర ప్రసాద్ రిజిస్ట్రేషన్ లేని ట్రాక్టర్‌లో బొనిగల హైమారావు, రేగులగడ్డ సురేష్, బొనిగల సుమన్ బాబు, పేరం మల్లికార్జునరావు తదితరుల సహకారంతో చోరీ చేసి తీసుకెళ్లినట్లు గ్రామ కార్యదర్శి ఫిర్యాదు చేశారు. ఈ విషయం తెలిసి పంచాయతీ వార్డు సభ్యులు గొల్ల సాంబయ్య, పులిపాటి రాజారాణి ఆ ప్రాంతానికి వెళ్లి ప్రశ్నించగా వారిపై కూడా దాడి చేసినట్లు పంచాయతీ వార్డు సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో ఇద్దరు మృతి

పోట్లూరు(శావల్యాపురం)సెప్టెంబరు 8: దేవాలయానికి విద్యుత్ అలంకరణ చేస్తూ విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురై యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని పోట్లూరు గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగింది. ఎస్ఐ లేళ్ల లోకేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు పోట్లూరు ఎస్సీకాలనీకి చెందిన పోపూరి దయాకరణ్ (22) గ్రామంలో విద్యుత్ మరమ్మతులు చేసుకొంటూ జీవనం సాగిస్తుంటాడు. గ్రామంలోని వడ్డెర కాలనీలోని రోడ్డు పక్కనున్న నీలంపాటి అమ్మవారి దేవాలయానికి శుక్రవారం రాత్రి విద్యుత్ అలంకరణ చేస్తున్నారు. దేవాలయం పక్కనే విద్యుత్ సర్వీస్ తీగలున్న విషయాన్ని గమనించని దయాకరణ్ దేవాలయానికి విద్యుత్ తీగలు అమర్చి పైకి లేచాడు. దాంతో సర్వీస్ తీగలు తగలడంతో దేవాలయం పైనుంచి కింద పడ్డాడు. స్థానికులు వెంటనే ఆటోలో దయాకరణ్‌ను వినుకొండలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. దయాకరణ్‌కు తల్లిదండ్రులు, అన్నయ్య ఉన్నారు. మృతదేహాన్ని పోలీసులు వినుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు.

ముప్పాళ్లలో మరొకరు..

ముప్పాళ్ళ, సెప్టెంబరు 8: వినాయక మండపం వద్ద విద్యుత్ షాక్‌కు గురై వ్యక్తి మృతి చెందిన సంఘటన ముప్పాళ్లలో శుక్రవారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం మేరకు గ్రామానికి చెందిన ఈర్ల లక్ష్మయ్య(50) గొర్రెలు కాస్తూ జీవనం సాగిస్తుంటాడు. వినాయక చవితి సందర్భంగా తమ ప్రాంతంలో ఏర్పాటు చేసిన వినాయక చవితి మండపం వద్దకు వెళ్లాడు. మండపానికి విద్యుత్ అలంకరణ చేశారు. శుక్రవారం రాత్రి భారీ వర్షం కురవటంతో మండపానికి విద్యుత్ ప్రసరణ జరిగి పలువురికి విద్యుత్ షాక్ తగిలింది. అందరూ పక్కకు తప్పుకోగా లక్ష్మయ్య మండపానికి ఉన్న ఇనుప స్తంభాన్ని పట్టుకోవటంతో షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య నాగేశ్వరి, కుమారుడు శివ నవీన్ ఉన్నారు. ఎస్ఐ సోమేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కౌలు రైతులకు న్యాయం చేస్తాం

● కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్



దెబ్బతిన్న వరి పైరును పరిశీలిస్తున్న కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని, ఎమ్మెల్యే నరేంద్ర, కలెక్టర్ నాగలక్ష్మి

పెదకాకాని, సెప్టెంబరు 8: 'కౌలు రైతులకు న్యాయం చేస్తాం. ఈ క్రాప్ బుకింగ్ పూర్తికాని చోట్ల వారంలోగా పనులు పూర్తి కావాలి. రైతులను ఇబ్బంది పెడితే ఊరుకునేది లేదు' అని గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాలైన పెదకాకాని మండలం వెంకటకృష్ణాపురం, అనుమర్లపూడి, తంగెళ్ళమూడి, చేబ్రోలు మండలం శేకూరు, వీరనాయకునిపాలెం, తెనాలి రూరల్ మండలం హాఫ్‌పేట, కాజీపేట ప్రాంతాలలో పెమ్మసాని, ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మితో కలిసి ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా నీట మునిగిన పంట పొలాలను ఆయన పరిశీలించారు. రైతులతో మాట్లాడి పెట్టుబడి, నష్టం తదితర అంశాలను తెలుసుకున్నారు. ప్రస్తుత వరద కారణంగా ఖరీఫ్ సీజన్ మొత్తం వృథాగా పోయిందనీ, కొన్ని సీజన్లలో సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నామని పొన్నూరు నియోజకవర్గ రైతులు పెమ్మసానికి వివరించారు. కాగా గతంలో పనులు ప్రారంభమై ఆగిపోయిన లిఫ్ట్ ఇరిగేషన్‌తో పాటు మరో నూతన ఎత్తిపోతల పథకం ప్రతిపాదనాలపై ఇరిగేషన్, అగ్రికల్చర్ అధికారులతో రైతుల సమక్షంలోనే పెమ్మసాని మాట్లాడారు.

ఈ క్రాప్ బుకింగ్ చేయలేదు

జగన్ ప్రభుత్వంలో కేవలం వైసీపీ నాయకులకు చెందిన పంటలను మాత్రమే ఈ క్రాప్ బుకింగ్ చేశారని, స్థానికంగా కొన్ని వేల ఎకరాలను ఈ క్రాప్‌లోకి పొందుపరచలేదని పర్యటనలో భాగంగా పెమ్మసానికి పలువురు రైతులు విన్నవించారు. దీంతో కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమసాని, ధూళిపాళ్ల అధికారులను పిలిచి వారంలోగా ఈక్రాప్ బుకింగ్ మొత్తం పూర్తి చేయాలని ఆదేశించారు. జనసేన నియోజకవర్గ ఇన్చార్జి వడ్రాణం మార్కండేయ బాబు, వెంకటకృష్ణాపురం సర్పంచి ధూళిపాళ్ల వెంకటేశ్వరావు, ఎంపీటీసీలు మోపర్తి శ్రీనివాసరావు, టీడీపీ, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు సేవలు ప్రశంసనీయం

పెదకాకాని, సెప్టెంబరు 8: వరద సహాయక ప్రాంతాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. సీఎస్ఆర్ నిధుల కింద పెమ్మసాని నేతృత్వంలో ముందుకొచ్చిన ఇండస్ టవర్స్ లిమిటెడ్ సంస్థ, వరద ప్రభావిత ప్రాంతమైన పెదకాకాని సుందరయ్య కాలనీలో దుప్పట్లు, చీరలు, లుంగిలు, టవల్స్‌తో కూడిన ఒక్కో కిట్ చొప్పున 350 మందికి కేంద్ర సహాయ మంత్రి చంద్రశేఖర్, ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర, ఇండస్ టవర్స్ లిమిటెడ్ సీఈవో గంటా దిలీప్ కుమార్ చేతుల మీదుగా ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ వరద ప్రభావిత ప్రాంతాల్లో తాను 4-5 రోజులుగా పర్యటిస్తున్నానని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిద్రాహారాలు మాని మరీ ప్రజలకు అందుబాటులో ఉంటున్నారని వివరించారు. పార్టీ మండల అధ్యక్షులు వలివేటి మురళి, పార్టీ నాయకులు బోయపాటి రామ్మోహన్, పెండ్యాల నాగ సురేష్, సీపీఎం పొన్నూరు నియోజకవర్గ కార్యదర్శి నన్నపనేని శివాజీ, పార్టీ గ్రామ అధ్యక్షుడు కుక్కల మల్లికార్జునరావు, ఆత్మకూరు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తక్షణమే నష్టం అంచనా వేయండి

వట్టిచెరుకూరు, సెప్టెంబరు 8: వ్యవసాయాధికారులు పంట నష్టం అంచనాలను రూపొందించాలని గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఆదేశించారు. మండల పరిధిలోని కోవెలమూడి, ముట్లూరు, కారంపూడిపాడు, గ్రామాల ఆయకట్టు పరిధిలో వరద ముంపునకు గురై ఇప్పుడిప్పుడే బయట పడుతున్న వరి పైరును ఆదివారం స్థానిక ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులుతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ పెమ్మసాని మాట్లాడుతూ నష్ట పోయిన ప్రతి రైతును కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. కోవెలమూడి , కారంపూడి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక చవతి మండపాల్లో పాల్గొన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు మన్నవ పూర్ణచంద్రరరావు, ప్రత్తిపాడు నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు నాగిశెట్టి నాగరాజు, జనసేన సమన్వయకర్త నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, శ్రీశైలం, వీరిశెట్టి సాంబయ్య, జగన్‌మోహన్‌రావు, ఉన్నవ నారాయణ, దేశం నాయకులు మురళి, సాంబశివరావు, రంగారావు, కృష్ణారావు, రైతులు పాల్గొన్నారు.

చోరీ కేసులో ఐదుగురు నిందితుల అరెస్టు

● రూ. 21 లక్షల సొత్తు రికవరీ



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జనార్దనరావు

పొన్నూరుటౌన్, సెప్టెంబరు 8: పొన్నూరు పట్టణంలో సంచలనంగా మారిన బంగారు దుకాణంలో చోరీ కేసులో ఐదుగురి నిందితులను పోలీసులు శనివారం అరెస్టు చేశారు. తెనాలి డీఎస్పీ జనార్దనరావు తెలిపిన వివరాల మేరకు.. పొన్నూరు పట్టణానికి చెందిన అబ్దుల్ సలీం ధనలక్ష్మి జ్యూలరీస్ పేరుతో వ్యాపారం నిర్వహిస్తున్నారు. ఈ నెల 4న అర్ధరాత్రి దుకాణంలో చోరీ జరిగింది. 24 కిలోల వెండి ఆభరణాలు పోయాయి. చోరీ సొత్తు విలువ రూ.20 లక్షలుగా ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసును ఒక రోజులోనే ఛేదించడమే కాకుండా చోరీ జరిగిన ఆభరణాలను స్వాధీనం చేసుకుని ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. సుమన్ కమతి, మిఠాలాల్ మాలి, ఉత్తమ్ సింగ్, విక్రమ్ దాస్ చరణ్ నలుగురు కలిసి ఈ నెల 1న విశాఖపట్నం వచ్చారు. అక్కడి నుంచి విజయవాడకు వచ్చారు. మిఠాలాల్ మాలి బెంగళూరుకు చెందిన పరశురామ్‌ను కారు అద్దెకు తీసుకుని బెంగళూరుకి చెందిన అమసింగ్, అజూ అనే వార్లను కూడా తీసుకు రమ్మని కబురు పంపారు. బెంగళూరు నుంచి టయోటా ఫార్చ్యూనర్ వాహనంలో ఈ నెల 4న విజయవాడ రాగా అందరూ కలిసి సాయంత్రం 4 గంటలకు పొన్నూరు వచ్చారు. పథకం ప్రకారం పట్టణంలోని తోటమ్మ తల్లి ఆలయం సమీపంలోని బంగారు దుకాణంలో చోరీకి పాల్పడ్డారు. సుమన్ కమతి, ఉత్తమ్ సింగ్, విక్రమ్ దాస్ చరణ్ షాపులోకి ప్రవేశించి వెండి వస్తువులు తీసుకొచ్చి కారులో పెడుతుండగా స్థానిక యువకులు గమనించి పట్టుకోవటానికి ప్రయత్నించగా, కారులో ఉన్న మిఠాలాల్ మాలిక్, పరశురామ్ సొమ్ముతో సహా పరారైయ్యారు. సుమన్ కమతి, ఉత్తమ్ సింగ్, విక్రమ్ దాస్ చరణ్‌లు వాహనం ఎక్కలేకపోవడంతో విడిగా పరారైయ్యారు. వీరిని సీఐ రవికిరణ్ రైల్వే స్టేషన్‌లో అదుపులోకి తీసుకున్నారు. 6వ తేదీ ఉదయం చిత్తూరు జిల్లా చంద్రగిరి సమీపంలోని దాదంకి టోల్‌ప్లాజా వద్ద మిఠాలాల్ మాలిక్, పరశురామ్‌లను చోరీ సొత్తు, కారుతోసహా అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో అమసింగ్, అజూ పరారీలో ఉన్నారు. ఈ ముద్దాయిలపై పలు పోలీస్‌స్టేషన్లలో చోరీ కేసులు నమోదైనట్లు డీఎస్పీ బి.జనార్దనరావు తెలిపారు. సమావేశంలో సీఐ కె.రవి కిరణ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు పవర్ లిఫ్టర్ల ఎంపిక



ఎంపికైన పవర్ లిఫ్టర్లతో అసోసియేషన్ ప్రతినిధులు

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 8: అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో ఈ నెల 14, 15 తేదీల్లో జరుగనున్న 11వ ఏపీ స్టేట్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్, బెంచిప్రెస్ పోటీలకు గుంటూరు జిల్లా జట్టును ఎంపిక చేసినట్టు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్మాకుల విజయభాస్కరరావు, షేక్ సందాని తెలిపారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, మాస్టర్స్ విభాగాల్లో జరిగే ఈ పోటీలకు జిల్లా నుంచి 30 మంది మహిళా లిఫ్టర్లు, 40 మంది పురుష లిఫ్టర్లు ఎంపికైనట్టు ప్రకటించారు. రాష్ట్ర పోటీలకు ఎంపికైన లిఫ్టర్లకు అసోసియేషన్ వైస్‌చైర్మన్ ఆర్ఎన్ వంశీకృష్ణ, కోశాధికారి గుమ్మడి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు బి.ప్రసాద్, పి.భాస్కరరావు, బొల్లినేని చంద్రిక, సంయుక్త కార్యదర్శులు ఘట్టమనేని సాయిరేవతి, ఎండీ మస్తాన్‌వలి, వలపర్ల శ్రీనాథ్, కార్యవర్గ సభ్యులు అభినందనలు తెలియజేశారు

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	114, 122,133
చికెన్ విత్ స్కిన్	216.00
చికెన్ స్కిన్ లెస్	226.00

వరద బాధితులకు విరాళాల వెల్లువ



సీఎం చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న డాక్టర్ ఎల్. కృష్ణ ప్రసాద్



మంత్రి లోకేశ్‌కు చెక్కు అందజేస్తున్న కాటూరి వైద్య బృందం

సిబార్ డెంటల్ కాలేజీ..

పెదకాకాని, సెప్టెంబర్ 8: వరద బాధితులను ఆదుకునేందుకు గుంటూరు జిల్లా తక్కెళ్లపాడులోని సిబార్ డెంటల్ కళాశాల యాజమాన్యం ముందుకొచ్చింది. ఈ మేరకు ఆదివారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలిసి కళాశాల తరఫున రూ. 10 లక్షల ఆర్థిక సహాయాన్ని సీఎం రిలీఫ్ ఫండ్‌కు అందజేశారు. అదేవిధంగా కళాశాల తరఫున మరో రూ.50 వేలను హరే కృష్ణ సంస్థకు అన్నదాన నిమిత్తం అందజేశారు. రూ.2 లక్షల విలువగల నిత్యవసర సరకులను విజయవాడ వరద బాధితులకు అందజేశారు. వెయ్యి మంది పేదలకు అన్నదానాన్ని అందజేశారు. డాక్టర్ ఎల్. కృష్ణ ప్రసాద్ ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ కృష్ణమోహన్, ప్రిన్సిపల్ డాక్టర్ రమణారెడ్డి, డాక్టర్ నగేష్, డీసీఐ ఎగ్జిక్యూటివ్ మెంబర్ డాక్టర్ రేవతి పాల్గొన్నారు.

కాటూరి వైద్యుల ఆధ్వర్యంలో...

ప్రత్తిపాడు, సెప్టెంబరు 8: మండల పరిధిలోని కొండ్రుపాడు వద్ద గల కాటూరి మెడికల్ కళాశాల ఆస్పత్రి వైద్యులు వరద బాధితుల సహాయార్థం రూ. 10 లక్షల విరాళాన్ని మంత్రి నారా లోకేశ్‌కు అందజేశారు. హాస్పిటల్ సూపరింటెండెంట్ చల్లా మోహనరావు, డీన్ డాక్టర్ వరప్రసాద్‌తోపాటు వైద్యుల బృందం లోకేష్‌ను కలిసి చెక్కును అందజేశారు. వరద సహాయక చర్యల్లో ప్రభుత్వం ముందున్నదని, ప్రభుత్వానికి తమ వంతు చేయూతగా డాక్టర్లందరి తరుఫున ఈ సాయం అందజేస్తున్నట్లు వారు తెలిపారు.

కుడికాలువలో ఒకరు గల్లంతు

ముగ్గురిని కాపాడిన పోలీసులు



కుడికాలువలో గాలిస్తున్న గజ ఈతగాళ్లు

దుర్గి, సెప్టెంబరు 8: మండలంలోని అడిగొప్పుల శివారులోని నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి ఆలయంలో మొక్కులు తీర్చుకునేందుకు ఆదివారం బాపట్ల జిల్లా, చీరాల మండలం, గవిడివారిపాలెంకు చెందిన కొందరు గ్రామస్థులు వచ్చారు. వీరిలో మిందా బాలు, అతని తండ్రి వెంకటేశ్వర్లు, కొనకాని శ్రీనివాసరావు, అతని కుమారుడు లోహిత్ అడిగొప్పుల కుడి కాలువలో స్నానం చేసేందుకు దిగారు. కాలువ ఉధృతంగా ప్రవహిస్తుండడంతో వారు కొట్టుకుపోతుండగా వినాయక నిమజ్జనం నిమిత్తం కాలువ వద్ద కాపలా కాస్తున్న పోలీసు సిబ్బంది ఎస్ఐ సుధీర్ కుమార్‌కు సమాచారం అందించారు. అనంతరం తాళ్ల సహాయంతో పోలీసు సిబ్బంది మిందా వెంకటేశ్వర్లు, కొనకాని శ్రీనివాసరావు, లోహిత్‌లను కాలువ నుంచి బయటకు లాగారు. కాగా మిందా బాలు కాలువలో కొట్టుకుపోయాడు. ఎస్ఐ సుధీర్‌కుమార్ గజ ఈతగాళ్ల ద్వారా వెతికించినా బాలు ఆచూకీ లభ్యం కాలేదు. ఎస్ఐ సుధీర్‌కుమార్ కుడి కాలువ వద్ద అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిబ్బందిని నియమించడం వలన ముగ్గురిని ప్రాణాలతో కాపాడగలిగారు.

వర్సిటీలో విదేశీ విద్యార్థి మృతి



మృతుడు రంగన్న

పెదకాకాని, సెప్టెంబరు 8: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో విదేశీ విద్యార్థి మృతి చెందిన సంఘటన ఆదివారం వెలుగు చూసింది. పెదకాకాని సీఐ నారాయణస్వామి తెలిపిన వివరాల మేరకు.. మయన్మార్ దేశానికి చెందిన రంగన్న(38) అనే విద్యార్థి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఎంఏలో బుద్ధిజం కోర్స్ చదువుతున్నాడు. గత రాత్రి మరో స్నేహితుడితో కలిసి విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఉన్న పుట్టల ప్రాంతంలో పుట్టగొడుగుల కోసం వెళ్లారు. అక్కడ పాము కాటు వేయటంతో గమనించిన స్నేహితుడు అతన్ని వైద్య చికిత్స నిమిత్తం మంగళగిరి ఎన్నారై ఆస్పత్రికి తరలించారు. అయితే రంగన్న అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించినట్లు పెదకాకాని పోలీసులు తెలిపారు. వర్సిటీ ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ ఇంచార్జి ఆచార్య పద్మావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

విద్యార్థి మృతి చెందడం బాధాకరం: మంత్రి నారా లోకేశ్

పాము కాటుకు విద్యార్థి మృతి చెందటం బాధాకరమని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సంతాపం వ్యక్తం చేశారు. ఈ సంఘటనపై ఆయన విచారం వ్యక్తం చేస్తూ ఇటువంటి సంఘటనలు వర్సిటీలో పునరావృతం కాకుండా అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఇళ్లలో చోరీల ముఠా అరెస్టు

● బంగారు, వెండి వస్తువులు స్వాధీనం

మేడికొండూరు సెప్టెంబరు 7: గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో వివిధ ప్రాంతాల్లో తాళాలు వేసిన ఇళ్లే టార్గెట్‌గా చేసుకుని చోరీలకు పాల్పడుతున్న దొంగల ముఠాను మేడికొండూరు పోలీసులు శనివారం అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి ఒక లక్ష 82 వేల రూపాయల విలువ గల బంగారు, వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. మేడికొండూరు సీఐ నాగూర్ మీరా సాహెబ్ కథనం ప్రకారం.. తెలంగాణ రాష్ట్రం మిర్యాలగూడెం మండలం గోగుల వారి గూడెంకు చెందిన నర్సింగ్ గంగాధర్, నర్సింగ్ మహేష్, పల్నాడు జిల్లా నరసరావుపేట టౌన్‌కు చెందిన చింత సాయికుమార్, బొలుకూరి హేమలింగేశ్వరరావు, జెట్టిపాటి కృష్ణ అనే ఐదుగురు ఏకమై చోరీలకు పాల్పడుతున్నారు. ఇళ్లకు తాళాలు వేసి ఉండటాన్ని గమనించి ఓ పథకం ప్రకారం ఇనుప రాడ్లు, గడ్డపారలు ఉపయోగించి తాళాలు తెరిచి ఇళ్లలోని నగదు, బంగారం, వెండి ఆభరణాలను దోచుకుంటారు. వీరు మేడికొండూరు మండలం కొర్రపాడు గ్రామంలో ఓ ఇంట్లో చోరీకి పాల్పడి సుమారు 339 గ్రాముల వెండి ఆభరణాలను దోచుకున్నారు. ప్రకాశం జిల్లా సంతమాగులూరు గ్రామంలో ఒక ఇంట్లో చోరీకి పాల్పడి 9 గ్రాముల వెండి, 16.5 గ్రాముల బంగారు ఆభరణాలను దోచుకున్నారు. నకరికల్లు మండలం కోంకలగుంట గ్రామంలో సుమారు 327 గ్రాముల వెండి వస్తువులు, 2 గ్రాముల బంగారపు వస్తువులు చోరీ చేశారు. వీరి వద్ద నుంచి మొత్తం 674 గ్రాముల వెండి, 18 గ్రాముల బంగారు వస్తువులతోపాటు చోరీలకు ఉపయోగించిన షిఫ్ట్ డిజైర్ కారు, రెండు ఇనుప రాడ్లు స్వాధీనం చేసుకున్నారు. శనివారం కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించారు. తుళ్లూరు డీఎస్పీ పి.మల్లికార్జునరావు, మేడికొండూరు సీఐ నాగూర్ మీరా సాహెబ్, ఎస్సై డేవిడ్ రాజు తదితరులు తమ సిబ్బందితో వారం రోజుల వ్యవధిలో ముఠాను అరెస్టు చేశారు. ముఠాను పట్టుకుని, వస్తువులను స్వాధీనం చేసుకున్న పోలీసులను జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ అభినందించారు.

కూటమి ప్రభుత్వం అండగా ఉంటుంది



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, సెప్టెంబరు 8: పైర్లు నష్టపోయిన రైతులు అధైర్య పడవద్దని, కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. నియోజకవర్గంలో వర్షాలకు దెబ్బతిన్న వరి పొలాలను ఆయన శనివారం పరిశీలించారు. చుండూరు మండలం తొట్టెంపూడి, మోదుకూరు, అమృతలూరు మండలం పెదపూడి, మోపర్రు, గోవాడ, పంచాళవరం, వేమూరు మండలంలోని పెరవలిపాలెం, పెరవలి, చావలి గ్రామాల్లో పర్యటించారు. దారులు సక్రమంగా లేని పొలాలకు ద్విచక్ర వాహనంపై వెళ్లిన ఆనందబాబును కలుసుకున్న రైతులు దెబ్బతిన్న పొలాలను చూపించి ఆవేదన వ్యక్తం చేశారు. నీరు కదలకుండా ఉన్న డ్రెయిన్‌లను ఆయన పరిశీలించారు. పంట నష్టం అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని అధికారులను ఫోన్ ద్వారా ఆదేశించారు. అనంతరం విలేఖర్ల సమావేశంలో మాట్లాడుతూ రైతులు అధైర్యపడవద్దని ప్రతి ఒక్క రైతును ఆదుకుంటామన్నారు. టీడీపీ, జనసేన పార్టీల శ్రేణులు పాల్గొన్నారు.



గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

ప్రజలందరికీ మంచి జరగాలి: ఎమ్మెల్యే మాధవి


గణనాథుడి పందిరిలో భక్తులతో ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే గళ్లా మాధవి తన కుటుంబ సభ్యులతో కలసి శనివారం వినాయక చవితి వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలందరికీ మంచి జరగాలని, వినాయకుని కృపాకటాక్షాలతో రాష్ట్రం అభివృద్ధి చెందాలని, వరద విపత్తు నుంచి ప్రజలు త్వరగా తేరుకోవాలని ఆకాంక్షించారు. స్థానిక లక్ష్మీనగర్, సాయి బాబా నగర్, వీఐపీ రోడ్డు, ఏటీ అగ్ర హారం, నాయుడుపేట, అరండల్‌పేట, కొండయ్య కాలనీ, జేకేసీ కాలేజీ ఓల్డ్ స్టూడెంట్స్, స్తంబాల గరువులో ఏర్పాటు చేసిన గణనాథులను ఎమ్మెల్యే మాధవి ఆదివారం దర్శించుకున్నారు.

వరద బాధితులకు కూరగాయలు, నిత్యావసరాలు పంపిణీ

గుంటూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): విజయవాడ వరద బాధితులకు బాసటగా నిలిచిన ప్రతి ఒక్కరూ అభినందనీయులేనని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి అన్నారు. స్థానిక 29వ డివిజన్ కమిటీ, టీడీపీ బీసీ సెల్ ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడ వరద బాధితులకు నిత్యావసర సరుకులు, కూరగాయలు సరఫరా చేశారు. రవాణా వాహనాలను టీడీపీ నియోజకవర్గ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో షేక్ మహబూబ్ సుభాని, మల్లె ఈశ్వరరావు, అడక శ్రీనివాసరావు, వేముల కొండ శ్రీను పాల్గొన్నారు.



విజేతలతో ఎమ్మెల్యే నసీర్, ఆలపాటి రాజేంద్రప్రసాదు, నిర్వాహకులు

వ్యాయామాన్ని అలవరుచుకోవాలి

● ఎమ్మెల్యేలు నసీర్, గళ్లా మాధవి

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 8: వ్యాయామాన్ని ప్రతి ఒక్కరూ అలవరచుకోవాలని పశ్చిమ, తూర్పు ఎమ్మెల్యేలు గళ్లా మాధవి, నసీర్ అహ్మద్‌లు అన్నారు. ఆదివారం స్థానిక శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో స్టేట్ లెవల్ కెటిల్ బెల్, జోనల్ లెవల్ బాడీ బిల్డింగ్ ఛాంపియన్ షిప్ పోటీలు- 2024 నిర్వహించారు. ఈ పోటీలను ప్రముఖ వైద్యులు రాఘవశర్మ, తారకనాథ్, జిల్లా బాడీ బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, మాజీమంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌తో కలసి వారు ప్రారంభించారు. అనంతరం నసీర్ అహ్మద్ మాట్లాడుతూ రానున్న మార్చి నాటికి తూర్పు నియోజకవర్గంలో 3 వ్యాయమశాలలను ఏర్పాటు చేసి నామమాత్రపు ఫీజులతో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. మరో అతిథి గళ్లా మాధవి మాట్లాడుతూ బాడీ బిల్డింగ్ పోటీల్లో పాల్గొనే బాడీ బిల్డర్లకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకారం అందిస్తుందని చెప్పారు. ఆలపాటి రాజేంద్ర ప్రసాదు మాట్లాడుతూ పేద, ప్రతిభ కల్గిన క్రీడాకారులకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఫిట్నెస్ బాడీ బిల్డర్స్ అసోసియేషన్ సెక్రటరీ నాగగౌతమ్, కెటిల్ బెల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎండీ జావీద్, ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ సతీష్ కుమార్ పాల్గొన్నారు

మృతుడి కుటుంబానికి పరిహారం అందజేత

గుంటూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): వరద బారిన పడ్డ ప్రతి ఒక్కరినీ ఆదుకోవడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. వారం రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు వరద నీటితో పొంగి ప్రవహిస్తున్న కాలువలో ప్రమాదశాత్తు పడి మృతి చెందిన వినోబా నగర్‌కు చెందిన మణి మాల శ్రీనివాస్ కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం చెక్కును ఆదివారం ఆయన అందజేశారు. మృతుడి భార్యకు ఈ చెక్కును అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నగేష్, చిలక వెంకటేశ్వర్లు, కోట పిచ్చిరెడ్డి, జానీమునియా పాల్గొన్నారు. ఇదిలా ఉండగా, విఘ్నేశ్వరుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఎమ్మెల్యే నసీర్ కోరుకున్నారు. స్థానిక కొత్తపేట, ఆరుంధతి నగర్, లీలా మహల్ సెంటర్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక చవితి పందిళ్లను ఆయన సందర్శించారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ 10న నిరసన

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 8: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కార్మిక రైతు సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 10న జరిగే నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి హనుమంతరావు, రైతు సంఘం నాయకుడు అజయ్ కుమార్ పిలుపు నిచ్చారు. ఆదివారం బ్రాడీపేటలోని ప్రజా సంఘాల కార్యాలయంలో జరిగిన రౌండ్ టేబుల్ సమా వేశంలో వారు మాట్లాడుతూ ఈ నెల 10న స్థానిక శంకర్ విలాస్ వద్ద జరిగే నిరసన కార్యక్రమంలో రైతులు కార్మికులు ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

చవితి మండపాలను తనిఖీ చేసిన ఎస్పీ


కమిటీ నిర్వాహకులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు, సెప్టెంబరు 8 : చవితి వేడుకల్లో ఎటువంటి అవాంచనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయా కమిటీ నిర్వాహకులకు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశించారు. ఆయన ఆదివారం లాలాపేట, నగరంపాలెం స్టేషన్‌ల పరిధిలోని పలు మండపాలను ఆకస్మికంగా తనిఖీ చేసి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వారికి వివరించారు. ఈ సందర్భంగా అక్కడ తీసుకోవాల్సిన జాగ్రత్తలను, ఇతర ముఖ్య విషయాలు అధికారులతో కలిసి స్థానిక ప్రజలతో మమేకమై గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులతో మాట్లాడారు. వినాయక చవితి పండుగ సందర్భంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా తగిన విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని, కమిటీ నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని కోరారు. నిమజ్జనం పూర్తయ్యే వరకు నిర్వాహకులు పూర్తి అప్రమత్తంగా ఉండాలన్నారు.

జిల్లాలో పలువురు ఎస్‌ఐల బదిలీ

గుంటూరు, సెప్టెంబరు 8 : జిల్లాలో పలువురు ఎస్సైలను బదిలీ చేస్తూ ఆదివారం ఎస్పీ సతీష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన ఎస్‌ఐల వివరాలు ఇలా ఉన్నాయి. తెనాలి రూరల్ ఎస్‌ఐ-2 పి.కోటేశ్వరరావును కొల్లిపర స్టేషన్‌కు బదిలీ చేశారు. కంట్రోల్ రూమ్‌లో విధులు నిర్వహిస్తున్న జి.శివ కృష్ణారెడ్డిని కొల్లూరు ట్రాఫిక్ స్టేషన్‌కు బదిలీ చేశారు. వీఆర్‌లో ఉన్న ఆర్.రవీంద్రారెడ్డిని తాడేపల్లి ట్రాఫిక్ స్టేషన్‌కు బదిలీ చేశారు. నల్లపాడు ఎస్‌ఐ వి.బాబురావును తుళ్లూరు స్టేషన్‌కు, అదేవిధంగా వీఆర్‌లో ఉన్న కే.ఏడుకొండలను కూడా తుళ్లూరు స్టేషన్‌కు బదిలీ చేశారు.

వీఆర్‌లో ఉన్న జాజం శ్రీనివాసరావును తాడేపల్లి స్టేషన్‌కు, అదేవిధంగా స్పెషల్ బ్రాంచ్‌లో ఉన్న టీ.నరేంద్ర కుమార్‌ను కూడా తాడేపల్లికి బదిలీ చేశారు. అదేవిధంగా తాడేపల్లి ట్రాఫిక్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న ఎం.సుబ్బారావును కూడా తాడేపల్లికి బదిలీ చేశారు. ప్రస్తుతం తాడేపల్లి స్టేషన్లో అటాచ్‌మెంట్‌పై ఉన్న పి.భాగ్యరాజును పాతగుంటూరు స్టేషన్‌కు బదిలీ చేశారు. అదేవిధంగా వీఆర్‌లో ఉన్న ఎం.కోటేశ్వరావును ఈస్ట్ ట్రాఫిక్ స్టేషన్‌కు బదిలీ చేశారు. డీసీఆర్‌బీలో ఉన్న డి.శ్రీహరిని వెస్ట్ ట్రాఫిక్‌కు బదిలీ చేశారు. ప్రమోషన్ అనంతరం వీఆర్‌లో ఉన్న కే.ఆదినారాయణను నగరంపాలెం స్టేషన్‌కు, అదే విధంగా షేక్ ఇబ్రహీంను తెనాలి-3 టౌన్ స్టేషన్‌కు, అలాగే షేక్ బాబావలిని కంట్రోల్ రూమ్‌కు బదిలీ చేస్తూ ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాలు ఇచ్చారు.

సమాజంలో ఉపాధ్యాయుడి పాత్ర విశిష్టం

గుంటూరు, సెప్టెంబరు 8: సమాజంలో ఉపాధ్యాయుని పాత్ర ఎంతో విశిష్టమైన దని లయన్స్ క్లబ్ ఆఫ్ జయహో గుంటూరు అధ్యక్షుడు ఎం.వెంకయ్య అన్నారు. నగరంలోని కె ఎస్‌ఆర్ నర్సింగ్ కాలేజీ ఆడిటోరియంలో ఆదివారం ఉమ్మడి గుంటూరు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమం జరిగింది. వివిధ పాఠశాలల్లో, కళాశాలలో ప్రతిభ కనబరిచిన 31 మంది ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కార్యదర్శి నరసింహారావు, ఏపీ రెసిడెన్షియల్ స్కూల్స్ సెక్రటరీ ఆర్.నరసింహరావు, లయన్స్ (316) హెచ్ వైస్ డిస్టిక్ గవర్నర్స్ సిహెచ్ హరిప్రసాద్, లక్ష్మీనారాయణ, రిటైర్డ్ ఎస్పీ చక్రపాణి, వై.కోటేశ్వరరావు, కె.శ్రీనివాసరావు ఉన్నారు.


ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు

వరద సహాయక సర్వేలో 'విజ్ఞాన్' విద్యార్థులు


సర్వే చేస్తున్న విజ్ఞాన్ విద్యార్థులు

గుంటూరు (విద్య) సెప్టెంబరు 8 చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్శిటీ, విజ్ఞాన్ లారాకి చెందిన 300కి పైగా విద్యా ర్థులు విజయవాడ నగరంలోని 18 వార్డ్‌లో అందుతున్న సహాయక చర్యల సర్వేలో పాల్గొన్నారని వర్సిటీ వైస్ చాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పి నాగభూషణ్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైస్ చాన్సలర్ మాట్లాడుతూ విజయవాడలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో తమ యూనివర్సిటీ విద్యార్థులు పర్యటిం చారని అన్నారు. అక్కడ వారికి అందుతున్న సహాయక చర్యలు బాగున్నాయా లేదా? వారు నివసిస్తున్న ప్రాంతాల్లో శానిటేషన్ జరిగిందా లేదా? వారి ఇళ్లకు విద్యుత్ సరఫరా, మంచి నీటి సరఫరా జరుగు తుందా లేదా? ముఖ్యమంత్రి , ఇతర ప్రభుత్వ అధికారుల పనితీరుపై మీరు సంతృప్తిగా ఉన్నారా లేదా అనే అంశాలపై ఎప్పటికప్పుడు ప్రజల నుంచి డేటా సేకరించి ప్రభుత్వం అందించిన గూగుల్ లింక్‌లో తమ విద్యార్థులు అప్‌డేట్ చేస్తున్నారని పేర్కొ న్నారు. సర్వేలో పాల్గొన్న విద్యార్థులను విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చాన్సలర్ కల్నల్ ప్రొఫెసర్ పీ నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎమ్మెస్ రఘునాథన్ అభినందించారు.

చెట్ల కొమ్మలు పడి నేలకూలిన విద్యుత్ స్తంభాలు


రవీంద్రనగర్ మెయిన్‌రోడ్డులో చెట్ల కొమ్మలు పడి కూలిన విద్యుత్ స్తంభం

గుంటూరు, సెప్టెంబరు 8: శ్యామలానగర్ రైలు గేటు పక్కనున్న రవీంద్ర నగర్ మెయిన్‌రోడ్డులో చెట్ల కొమ్మలు పడి రెండు విద్యుత్ పోల్స్ నేలకూలిన సంఘటన ఆదివారం స్థానికంగా భయాందోళన కలిగించింది. ఒక్కసారిగా పెద్ద వృక్షాల కొమ్మలు 11 కేవీ లైన్‌ల ఫీడర్లపై పడటంతో పోల్స్ నేలకూలిపోయాయి. దాంతో పెద్ద శబ్ధంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయాయి. ఆదివారం ఉదయం జరిగిన ఈ ఘటనతో ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ సమాచారం తెలుసుకున్న డి 4 సెక్షన్ ఏఈ అక్కిరెడ్డి హుటాహుటిన సిబ్బందిని రంగంలోకి దించారు. ముందుగా అటుగా రాకపోకలు సాగిస్తున్న వాహనాలను దారి మళ్లించి సాయంత్రానికి విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టారు. సంఘటన ప్రదేశానికి చేరుకొని పరిస్థితి సమీక్షించారు.

కోర్టులో మహిళా ఉద్యోగినిపై అసభ్య ప్రవర్తన

● కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు

గుంటూరు, సెప్టెంబరు 8 : జిల్లా కోర్టులోని ఓ మహిళ ఉద్యోగినిని లైంగికంగా వేధించిన ఘటనలో కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేశారు. స్థానిక పట్టాభిపురం పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న హనుమంతరావు జిల్లా కోర్టులో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్న ఓ మహిళతో అసభ్యంగా ప్రవర్తించాడు. ఆమెకు ఫోన్ చేసి వేధిస్తుండటంతో బాధిత మహిళ జడ్జికి ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ విచారణకు ఆదేశించారు. విచారణలో కానిస్టేబుల్ హనుమంతరావు ఆమె పట్ల లైంగిక వేధింపులకు పాల్పడిన విషయం వాస్తవమని తేలింది. దీంతో ఆయనను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఆదేశాలు ఇచ్చారు. 2020 నుంచి పట్టాభిపురం పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్ గా ఆయన విధులు నిర్వహిస్తున్నారు

వైద్య రంగంలో ఫిజియోథెరపీది కీలక పాత్ర


ఫిజియోథెరపీ డే వేడుకలలో పాల్గొన్న ఫిజియోథెరపిస్టులు

గుంటూరు (తూర్పు), సెప్టెం బరు 8: భవిష్యత్తులో వైద్య రంగంలో ఫిజియోథెరపీ కీలక పాత్ర పోషించబోతుందని ప్రముఖ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ మల్లెల దిలీప్ కుమార్ అన్నారు. స్థానిక ఆర్టీసీ కాలనీలో ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డారు. కార్యక్రమంలో హారికా కళా శాల చైర్ పర్సన్ మహీనా షేక్, ప్రిన్సి పాల్ సుభాని, షేక్ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బీఈహరికృష్ణ, డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, డాక్టర్ ఇమ్రాన్ ఖాన్, డాక్టర్ దయాకర్ పాల్గొన్నారు.

విఘ్నేశ్వరుడి చల్లని చూపు అందరిపై ఉండాలి : దేగల

గుంటూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలను విఘ్నేశ్వరుడు చల్లగా చూడాలని టీడీపీ నగర అధ్యక్షుడు దేగల ప్రభాకర్ కోరుకున్నారు. నగరంలో ఏర్పాటు చేసిన గణనాధుడి పందిళ్లలో ఆదివారం ఆయన ప్రత్యేక పూజలు చేశారు. వివిధ మండపాలలో కొలువుదీరిన విఘ్ననాయకుడిని ఆయన దర్శించుకున్నారు.

ముగిసిన జిల్లా అథ్లెటిక్స్ జట్ల ఎంపికలు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 8: ఈ నెల 14 నుంచి 16 వరకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగే ఏపీ స్టేట్ అంతర్ జిల్లాల జూనియర్ అథ్లెటిక్ మీట్‌లో పాల్గొనే గుంటూరు జిల్లా అథ్లెటిక్ జట్టు ఎంపికలు ముగిసినట్లు సంఘం కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైనన క్రీడాకారులు ఈ నెల 10 లోపు తమ వయస్సు ధృవీకరణ పత్రం, ఆధారకార్డుతో పాటు రిజిస్ట్రేషన్ ఫామ్‌ను అందజేయాలని సూచించారు.

వరద బాధితులకు సాయం

గుంటూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): విజయవాడలోని వరద బాధితులను ఆదుకునేందుకు టీడీపీ గుంటూరు నగర కార్యదర్శి నిశంకరరావు అమర్‌నాథ్ తన వంతుగా ఆర్థిక సాయం చేశారు. 16వ డివిజన్ నుంచి 9 క్వింటాళ్ల బియ్యం నిమిత్తం రూ.45 వేల ఆర్థిక సహాయాన్ని ఆదివారం అందిం చారు. పెదరత్తయ్యను గుంటూరులోని ఆయన నివాసంలో కలిసి ఆ మొత్తాన్ని అందజేశారు.

బురద తొలగింపునకు 40 ప్రెషర్ మెషిన్లు

● విజయవాడకు పంపిన గుంటూరు ఐఎంఏ వైద్యులు



మాట్లాడుతున్న ఐఎంఏ డాక్టర్లు

గుంటూరు (మెడికల్) సెప్టెంబరు 8: విజయవాడ వరద బాధితులకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) గుంటూరు నగర శాఖ అండగా నిలిచింది. మొన్నటికి మొన్న సీఎం సహాయ నిధికి దాదాపు రూ.13 లక్షలు విరాళం అందజేసిన ఐఎంఏ గుంటూరు శాఖ, తాజాగా విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాల్లో బురదను తొలగించేందుకు 40 వాటర్ ప్రెషర్ మెషిన్లను అగ్నిమాపక శాఖకు అందజేసింది. గుంటూరులోని ఐఎంఏ కార్యాలయం నుంచి ఈ 40 మెషిన్లను లారీలో విజయవాడకు తరలిం చారు. అక్కడ అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ మాదిరెడ్డి ప్రతాప్‌కు స్వయంగా గుంటూరు ఐఎంఏ బ్రాంచ్ సెక్రటరీ డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి ఈ మెషిన్లను అందజేశారు. మెడికల్ హాల్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో ఐఎంఏ స్టేట్ ప్రెసిడెంట్ ఎలెక్ట్ డాక్టర్ జీ నందకిషోర్ మాట్లాడుతూ చిన్న సందుల్లో ఉన్న ఇళ్ల వద్దకు అగ్ని మాపక శాఖ వాహ నాలు వెళ్లలేకపోతున్నాయని, బురద తొలగింపు ప్రక్రియ ఆలస్యమవుతోందని, దీనిని దృష్టిలో ఉంచుకొని తమ వంతుగా 40 మెషిన్లను వివిధ ఆసుపత్రుల నుంచి సేకరించి విజయవాడకు పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి కే.కృష్ణారెడ్డి, ఐఎంఏ నగర అధ్యక్షుడు డాక్టర్ నూతక్కి శ్రీనివాసరావు, డాక్టర్ వెలగా మహేష్, డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ కార్యకర్త గాడిపర్తి శ్రీనివాసరావు మృతి



గుంటూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ కార్యకర్త గాడిపర్తి శ్రీనివాసరావు స్థానిక శ్రీనివాస రావు పేటలో మృతి చెందారు. ఎమ్మెల్యే గళ్లా మాధవి, టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహ క కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు ఆదివారం ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

నేటి ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 8: జిల్లాలో భారీ వర్షాల కారణంగా సోమవారం కలెక్టరేట్‌లో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

పోలీస్ కార్యాలయంలో కూడా..

గుంటూరు, సెప్టెంబరు 8 : జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఈసారి కూడా రద్దు చేశారు. బంగాళాఖాతంలో ఏర్పడ్డ వాయు గుండం నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎస్పీ తెలిపారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 8: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై ఆదివారం గుళ్ళపల్లి సుబ్బారావు సేవాసంస్థ ఆధ్వర్యంలో శారదానికేతన్ విద్యార్థినుల కూచిపూడి, జానపద, కోలాట నృత్య ప్రదర్శనలు జరిగాయి. ఆలయ అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, ఆలయ అధ్యక్షుడు మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, ప్రిన్సిపల్ జీ.శ్రీనివాసరావు, పి.సాంబశివరావు పాల్గొన్నారు.



అవార్డు అందజేస్తున్న డాక్టర్ షమా తదితరులు

ఘనంగా పాన్ ఇండియా ఐకానిక్ టీచర్ అవార్డ్స్

గుంటూరు (విద్య), సెప్టెంబరు 8 : అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక గోరంట్లలోని కెనడీ నెక్స్ జెన్ స్కూల్‌లో పాన్ ఇండియా ఐకానిక్ టీచర్స్ అవార్డ్స్-2024 కార్యక్రమం ఆదివారం ఉదయం వైభవంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ టీచర్స్ అండ్ లెక్చరర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో హోప్ విన్ హాస్పిటల్స్ చైర్మన్, ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ షమ సుల్తానా ముఖ్య అతిథిగా పాల్గొని అవార్డు గ్రహీతలకు అవార్డులు అందజేశారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ఆధునిక ప్రపంచంలో సమాజ గతిని మార్చగల శక్తి ఉపాధ్యాయులదేనని అన్నారు. అంకిత భావంతో పనిచేసున్న ఉపాధ్యాయులను, అధ్యాపకులను గుర్తించి రాష్ట్రస్థాయి అవార్డులను ప్రదానం చేయడం అభినందనీయమని అన్నారు. అనంతరం ప్రైవేట్ టీచర్స్ అండ్ లెక్చరర్స్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు రామనాథం అనిల్ కుమార్ మాట్లాడుతూ ఎనిమిదేళ్ల క్రితం స్థాపించిన ఫెడరేషన్ ద్వారా కరోనా సమయంలో వందలాది మంది ప్రైవేటు ఉపాధ్యాయ, అధ్యాపకులకు దాతల సహకారంతో ఆర్థిక సహకారం అందించి వారిలో ధైర్యాన్ని నింపామన్నారు. కార్యక్రమంలో హైకోర్టు లాయర్ డాక్టర్ కన్న రజిని, బి. పార్వతి నాయుడు, కన్న స్కూల్ అధినేత కన్న మాస్టర్, డైరెక్టర్ అనిల్, మానసిక వికాస నిపుణులు డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు, ఇండో అమెరికన్ డాక్టర్ చాగంటి సుబ్బారావు, పాటిబండ్ల విష్ణువర్ధన్, ఫెడరేషన్ కార్యవర్గ సభ్యులు, గిరిధర్ పాల్గొన్నారు.

అవార్డు అందుకున్న సీతారామయ్య హై స్కూల్ ఉపాధ్యాయురాలు

గుంటూరు(కార్పొరేషన్), సెప్టెంబర్ 8 : పాన్ ఇండియా ఐకానిక్ టీచర్ అవార్డ్స్ తమ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయురాళ్లు జంపని పద్మజ, కర్లపూడి పార్వతి దేవి అందుకున్నారు. ఈ విషయాన్ని కళాశాల సెక్రెటరీ, కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణు వర్ధన్ తెలిపారు. ఈ అవార్డులు తమ సంస్థకు రావడం అభినందనీయమన్నారు.

విద్యా పర్యావరణ అభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలి

● ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణ్ రావు

గుంటూరు (విద్య), సెప్టెంబర్ 8: విద్యా పర్యావరణ అభివృద్ధికి ఉపాధ్యా యులు కృషి చేయాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు విజ్ఞప్తి చేశారు ఆదివారం బ్రాడీపేటలోని యుటిఎఫ్ కార్యా లయంలో నిర్వహించిన జనవిజ్ఞాన వేదిక వార్షిక సమావేశంలో ఆయన మాట్లాడారు మాట్లాడుతూ ప్రథం సర్వే ప్రకారం రాష్ట్రంలో విద్యాపరంగా ఇంకా వెనుకబాటులో ఉన్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఉపాధ్యాయుడు గ్రామాన్ని దత్తత తీసుకొని తమ పాఠశాల అభి వృద్ధికి కృషి చేయాలన్నారు. జనవిజ్ఞాన వేదిక కార్యదర్శి డాక్టర్ ఏ సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించేలా కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక నాయకులు బీ ప్రసాద్, టీఆర్ రమేష్, వీవీకే సురేష్, ఎస్ఎం సుభాని, శంకర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సేవాసమితి ఆధ్వర్యంలో ఉపకారవేతనాల పంపిణీ

గుంటూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా పేద, ప్రతిభ కలిగిన బ్రాహ్మణ విద్యార్థులకు బ్రాహ్మ ణ సేవా సమితి ఆధ్వర్యంలో ఉపకారవేత నాలను పంపిణీ చేశారు. ఆదివారం ఉదయం స్థానిక బ్రాడీపేట 1/13వ లైనులోని బ్రాహ్మణసేవా సమితి ప్రాంగణంలో 2024-25 సంవ త్సరానికి విద్యా పారితోషికం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు ఆర్. లక్ష్మీ పతి మాట్లాడుతూ సుమారు రూ.18 లక్షలను 250 మంది విద్యార్థినీ విద్యార్థులకు ఇంటర్, డిగ్రీ, పీజీ, సీఏ, ఇంజనీరింగ్, మెడిసిన్ చదువుకుంటున్న వారికి అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సేవా సమితి కార్యదర్శి తుళ్లూరు ప్రకాష్ సమితి సభ్యులు పాల్గొన్నారు.

గరికపాటి రాజారావు సేవలు చిరస్మరణీయం

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 8: కళ కళ కోసం కాదు ప్రజలకోసం అంటూ ప్రజా సమస్యలను కళారూపాలుగా తీర్చిదిద్దిన గరికపాటి రాజారావును ఆదర్శంగా తీసుకుని కృషి చేయాలని ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షురాలు ఎస్.పద్మ అన్నారు. ఆదివారం బ్రాడీపేటలోని ప్రజానాట్యమండలి జిల్లా కార్యాలయంలో ప్రజా కళాకారుడు గరికపాటి రాజారావు సంస్మరణ సభ జరిగింది. కార్యక్రమంలో గుజ్జుల జాషువా విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ ట్రస్టీ పాశం రామారావు, ప్రజా నాట్యమండలి జిల్లా ఉపాధ్యక్షుడు లూథర్‌పాల్, వై నేతాజి, ఎమ్ రవి, దండా లక్ష్మీనారాయణ, ఎమ్ ఏ చిష్టీ, ఎల్ అరుణ, తదితరులు పాల్గొన్నారు.

2024 మార్చి 21న ఎం.కె.రంజిత్ సిన్హా అండ్ అదర్స్ కేసులో వాతావరణ మార్పుల దుష్ప్రభావాలనుంచి పర్యావరణాన్ని రక్షించుకోవడం 'ప్రాథమిక మానవహక్కు' అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు చొరవ ప్రదర్శించి, క్రియాశీలతతో తీర్పును వెలువరించినట్లుగా పర్యావరణ ప్రేమికులు, మేధావులు వ్యాఖ్యానించారు. ఈ సందర్భంలో న్యాయ వ్యవస్థ క్రియాశీలతను సమగ్రంగా అధ్యయనం చేద్దాం.

గ్రూప్-1 మెయిన్స్ ప్రత్యేకం

ఇండియన్ పాలిటీ

న్యాయ వ్యవస్థ క్రియాశీలత

న్యాయశాఖ క్రియాశీలత అనేది న్యాయసమీక్షాధికారంలో అంతర్భాగం. న్యాయశాఖ క్రియాశీలత అనగా న్యాయవ్యవస్థ తన అధికార విధులను మరింత చొరవగా, క్రియాశీలకంగా, ఉదారంగా వినియోగించడం. న్యాయాన్ని ప్రజలకు అందించే క్రమంలో అనేక నూతన పద్ధతులను, ప్రక్రియలను వినియోగించి సమ న్యాయపాలనకు అవసరమైన అన్ని చర్యలను చేపడుతుంది. సామాజిక హక్కులను రక్షిస్తూ, సామాన్య ప్రజలకు న్యాయాన్ని అందుబాటులోకి తీసుకురావడానికి సుప్రీంకోర్టు, అపెక్స్ జ్యుడీషియల్ బాడీగా దీనికి కేంద్ర బిందువు అయ్యింది.

న్యాయపరమైన కృతశీలత అనేది చట్టాలను చొరవతో, చురుగ్గా వివరించే సందర్భాలను సూచిస్తుంది. న్యాసమీక్ష సాంప్రదాయ సరిహద్దులను దాటి రాజ్యాంగ విలువలను సమర్థించే విషయాల్లో జోక్యం చేసుకుంటుంది.

చేసింది. కేశవానంద భారతి కేసు(1973)లో సుప్రీంకోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పు పార్లమెంటు అధికారాలపై పరిమితులు విధిస్తూ పరోక్షంగా న్యాయవ్యవస్థ పరిధిని విస్తృతం చేసింది. ఈ తీర్పులో రాజ్యాంగ మౌలిక స్వరూప సిద్ధాంతాన్ని వెలువరించింది. తరవాత కేసుల్లో కూడా తన తీర్పుల ద్వారా దానిని కొనసాగించింది.

ఎమర్జెన్సీ తరవాత వచ్చిన రాజకీయ-పౌరచైతన్యం వల్ల ప్రజాహిత వ్యాజ్యాలు(పిల్) వాడుకలోకి వచ్చాయి. న్యాయ సహాయాన్ని అందించమని నేరుగా న్యాయవ్యవస్థను కోరేలా ప్రజాహిత వ్యాజ్యాలు ప్రజలను చైతన్య పరిచాయి. శాసన



న్యాయవ్యవస్థ క్రియాశీలత - పరిణామం

గోలక్‌నాథ్ కేసు సుప్రీంకోర్టుకు వచ్చేవరకు ప్రాథమిక హక్కుల సవరణతోపాటు పార్లమెంటు చేసిన చట్టాలన్నింటిపై సుప్రీంకోర్టు ఎలాంటి విభేదాన్ని ప్రకటించలేదు. కానీ 17వ రాజ్యాంగ సవరణ(1964) ద్వారా అప్పుడు ప్రాథమిక హక్కుగా ఉన్న ఆస్తిహక్కును సవరిస్తూ పార్లమెంటు చట్టం చేసింది. అయితే ప్రాథమికహక్కు అయి న ఆస్తిహక్కును సవరించే అధికారం ప్రకరణ-368 కింద పార్లమెంటుకు లేదని గోలక్‌నాథ్ కేసు(1967)లో సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ తీర్పు నుంచే పార్లమెంటుకు న్యాయవ్యవస్థకు మధ్య ఘర్షణ ప్రారంభమైందని రాజనీతి శాస్త్రవేత్తల అభిప్రాయం. ఈ ఘర్షణ పరోక్షంగా న్యాయవ్యవస్థ క్రియాశీలతకు దోహదం

శాఖ, కార్యనిర్వాహక శాఖల బలహీనతే న్యాయశాఖ క్రియాశీలతకు కారణమని రాజ్యాంగవాదుల అభిప్రాయం.

ప్రజాప్రయోజనాల వ్యాజ్యాలు వాడుకలోకి వచ్చినప్పటి నుంచి పౌరులు, స్వచ్ఛంద సంస్థలు మిగిలిన రెండు శాఖల కార్యకలాపాల్లో జోక్యం చేసుకుని 'ప్రజాహితాన్ని' కాపాడమని అర్థించడం న్యాయ వ్యవస్థకు బలాన్నిచ్చాయి. దాంతో కార్యనిర్వాహఖ శాఖ అధికారాల్లో న్యాయవ్యవస్థ జోక్యం చేసుకోవడం మొదలుపెట్టింది. ఉదాహరణకు కావేరి నదీ జలాల సమస్యను చర్చించడానికి దక్షిణాది రాష్ట్రాల ముఖ్య మంత్రుల సమావేశాన్ని ఏర్పాటుచేయాలని సుప్రీంకోర్టు సూచించడం. రోడ్లు, వంతెనలు నిర్మించాలని ప్రభుత్వానికి ఆదేశాలివ్వడం, రైళ్ల రాకపోకలకు 'సమయ పాలన' పట్టికలను రూపొందించాలని చెప్పడం, విద్యాసంస్థల్లో

దిక్సూచి

DIKSUCHI

అడ్మిషన్లు ఎలా జరపాలో నిర్దేశించడం. ఈవిధమైన తీర్పులన్నింటినీ పరిశీలిస్తున్న రాజ్యాంగ మేధావులు 'న్యాయ వ్యవస్థతో నడుస్తున్న ప్రభుత్వాలు' అని వ్యాఖ్యానిస్తున్నారు. ఈ అతిక్రియాశీలతను కట్టడి చేయడానికి సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఎ.కె.మాథుర్, మార్కండేయ కట్జూ 'న్యాయ వ్యవస్థ సహేతుకత'ను ప్రతిపాదించారు. తరచుగా ఈ అతి క్రియాశీలతను వినియోగించడం ఆరోగ్యకరమైన సంకేతం కాదని న్యాయమూర్తి హెచ్.ఆర్.ఖన్నా అభిప్రాయపడ్డారు.

న్యాయశాఖ క్రియాశీలతకు కారణాలు

- శాసనశాఖ, కార్యనిర్వాహక శాఖ తమ విధుల నిర్వహణలో వైఫల్యం చెంది ప్రజల నమ్మకాన్ని కోల్పోవడం.
- ఓటుబ్యాంకు రాజకీయాల వల్ల దీర్ఘకాలిక, నిర్మాణాత్మక, కఠినమైన నిర్ణయాలు చేయకపోవడం వల్ల ప్రజల కనీస అవసరాలు కూడా మెరుగుపర్చని స్థితిలో ప్రభుత్వాలు కొనసాగడం.
- ప్రజాప్రయోజనాల వ్యాజ్యంతో మూడో వ్యక్తి కూడా కోర్టును ఆశ్రయించే అవకాశం లభించింది. దాంతో స్వచ్ఛంద సంస్థలు, పౌర హక్కుల సంఘాలు వందల సంఖ్యలో ప్రజా ప్రయోజనాలున్న కేసులను హైకోర్టు, సుప్రీంకోర్టు దృష్టికి తీసుకువచ్చాయి.
- న్యాయస్థానాలు స్వయంప్రేరిత కేసులను ప్రవేశపెట్టి ప్రజల హక్కుల కోసం తగిన ఆదేశాలను జారీచేయడం.(ఉదాహరణకు కోర్టుకు వచ్చిన ఉత్తరాల ద్వారా, పేపర్లలో వచ్చిన వార్తల ఆధారంగా తనంత తానుగా ఆ సంఘటనలను విచారణకు స్వీకరించడం).
- దత్త శాసనాధికారాల వల్ల కార్యనిర్వాహక శాఖ అధికారాలు విస్తృతమై అధికార దుర్వినియోగం, జవాబుదారీతనం లోపించడం.



డాక్టర్ సుంకర రమాదేవి,
అసిస్టెంట్ ప్రొఫెసర్

న్యాయశాఖ క్రియాశీలత - ముఖ్య వివాదాలు

- ఫరీదాబాద్ గనుల్లో పనిచేసే బాల కార్మికుల స్థితిగతులపై బందువా ముక్తి మోర్చా వివాదంలో సుప్రీంకోర్టు తీర్పు.
- లక్ష్మీకాంత్, యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న మోసాలు, చిన్నపిల్లల దత్తత వివాదంలో సుప్రీంకోర్టు తీర్పులు.
- తాజ్‌మహల్ పరిసర ప్రాంతాల్లో కాలు ష్యం, తద్వారా తాజ్ మహల్‌కు ఉన్న ముప్పుపై కేసులు.
- బిహార్ ఖైదీల కేసు; బిహార్ పశుగ్రాసం కేసు.
- జార్ఖండ్ ముక్తిమోర్చా అవినీతి వివాదం.
- రక్షణశాఖలో కొనుగోలు కుంభకోణాలు మొదలైన వివాదాలు.
- జడ్జిల నియామకం.
- కర్ణాటక ముఖ్యమంత్రి ఎస్.ఆర్.బొమ్మై కేసు(1994)లో 356వ ప్రకరణ దుర్వినియోగాన్ని అరికట్టడానికి కొన్ని సూచనలివ్వడం.
- సతీష్‌శర్మ - పెట్రోల్ బంకుల కేటాయింపుల దుర్వినియోగం.
- గంగానది కాలుష్య నివారణ.
- వాహన కాలుష్యం వల్ల ఢిల్లీవాసుల జీవించేహక్కుకు భంగం కలిగిందంటూ ఒక పౌరుడు వేసిన కేసులో డీజిల్ బస్సులను సీఎన్‌జీ బస్సులుగా మార్చాలని ఆదేశించడం.
- అడవుల్లో చెట్లను విచక్షణారహితంగా నరికివేయడానికి సంబంధించి.
- కాలుష్య కారక పరిశ్రమలను మూసివేయాలంటూ ఆదేశించడం.
- ఢిల్లీలో అక్రమ నిర్మాణాలను తొలగించడం.

గుప్తా వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసు(1982)లో మహారాష్ట్ర హైకోర్టు తీర్పు చెబుతూ న్యాయస్థానాలు క్రియాశీలకంగా వ్యవహరిస్తాయని పేర్కొంది. ఆదే విధంగా పీయూడీఆర్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసు(1982)ను కూడా ఇక్కడ పేర్కొనవచ్చు. 9వ ఆసియా క్రీడల కోసం చేపట్టిన నిర్మాణాల్లో పాల్గొనడానికి వచ్చిన వారి శ్రమను యాజమాన్యం దోచుకుంటోందని ఒక స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని స్వీకరించి కార్మికులకు పని గంటలను నిర్ధారించింది.

1998 ప్రాంతంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ ఎం.కె.బెజ్ బారువాను ఆ శాఖ నుంచి మరో శాఖకు బదిలీ చేశారు. ఈ బదిలీ సహజంగా జరిగింది కాదని, ఉద్దేశపూర్వకంగా చేశారని సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. సుప్రీంకోర్టు బెజ్ బారువా బదిలీ విషయంలో కేంద్రప్రభుత్వ చర్యను తప్పుపట్టింది.

- ఐ.ఆర్.కొయల్హా కేసు(2007)లో 9వ షెడ్యూల్‌లోని అంశాలను కూడా న్యాయసమీక్ష చేయవచ్చని తీర్పుచెప్పడం.
- శ్రేయాసింఘాల్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో ఐటీ చట్టంలోని సెక్షన్ 66ఏను కొట్టివేయడం(2015).
- ఉన్నత న్యాయస్థానాల్లో జడ్జిల నియామకాలకు సంబంధించి కొలీజియం వ్యవస్థను పునరుద్ధరించడం(2015)
- రామ్‌సింగ్ కేసు(2015)లో వెనుకబడిన తరగతుల కమిషన్ సిఫార్సులకు వ్యతిరేకంగా జాట్‌లను ఓబీసీల్లో చేర్చడాన్ని కొట్టివేయడం.

లెటర్ రిపీటెడ్ సిరీస్

● రీజనింగ్

ఏపీపీఎస్సీ పోటీ పరీక్షల ప్రత్యేకం

లెటర్ సిరీస్‌కు సంబంధించిన ప్రశ్నల్లో కొన్ని అక్షరాల సమూహాలను ఒక సిరీస్‌గా పేర్కొంటారు. ఈ అక్షర సమూహాలు రకరకాలుగా ఉంటాయి. అనగా 3, 4, 5 లేదా 6 అక్షరాలు గల సమూహాలు రిపీటెడ్‌గా రావడం.

ఉదా: dabc/dabc/dabc/dabc. లేదా

ఒక క్రమపద్ధతిలో అక్షర సమూహాలు విభజించడం.

ఉదా: ab/aabb/aaabbb/aaaabbbb.

గమనించండి: మొదటి సమూహంలో ఒక ab, రెండో సమూహంలో రెండు aలు, రెండు bలు, మూడో సమూహంలో మూడు aలు, మూడు b లు ఇలా ఒక క్రమపద్ధతిని అనుసరించి సిరీస్ ఏర్పడుతుంది. లేదా ఒక్కోసారి చెయిన్ పద్ధతిలో అక్షర సమూహాలు ఉంటాయి.

ఉదా: abc/bca/cab/abc.

మొదటి సమూహంలో చివరి రెండు అక్షరాలు రెండో సమూహంలో మొదటి రెండు అక్షరాలుగా, మొదటి సమూహంలో మొదటి అక్షరం రెండో సమూహంలో చివర ఉన్నది. అదేవిధంగా రెండో సమూహంలో చివరి రెండు అక్షరాలు మూడో సమూహంలో మొదటి రెండు అక్షరాలుగా, రెండో సమూహంలో మొదటి అక్షరం మూడో సమూహంలో చివరి అక్షరంగా ఉన్నది. ఈ విధంగా ఒక సక్రమమైన చెయిన్ పద్ధతిలో ఈ సిరీస్ ఉన్నది.

ఈ విభాగానికి సంబంధించిన ప్రశ్నలు ఉండే పద్ధతి

కొన్ని అక్షరాల సమూహాన్ని ఒక సిరీస్‌గా పేర్కొంటారని పైన చెప్పుకున్నాం. ఈ అక్షరాల మధ్య మధ్య కొన్ని అక్షరాలను వదిలేస్తారు. ఆ సిరీస్‌లో వదిలేసిన అక్షరాల సమూహం ఐచ్ఛికాలుగా ఇచ్చిన ఎ, బి, సి, డిలలో ఉంటుంది. కాబట్టి ప్రశ్నగా ఇచ్చిన సిరీస్ ఏ క్రమపద్ధతిని అనుసరిస్తున్నదో తెలుసుకోవాలంటే ఐచ్ఛికాలుగా ఇచ్చిన ఎ, బి, సి, డిలలో గల అక్షరాలను ప్రశ్నలోని ఖాళీల్లో పూరించి సిరీస్‌ని అవగాహన చేసుకోవాలి. సమాధానాలుగా ఇచ్చిన ఎ, బి, సి, డిలలో ఏ ఆప్షన్‌లోని అక్షరాలను ఖాళీల్లో పూరించిన ఆ సిరీస్ క్రమపద్ధతిని అనుసరిస్తుందో ఆ ఆప్షన్‌ను సమాధానంగా గుర్తించాలి.

ఈ సిరీస్‌కు సంబంధించిన ప్రశ్నలలో అభ్యర్థి ముందుగా ఆ సిరీస్‌లో ఉపయోగించిన అక్షరాలు గమనించాలి. మూడు అక్షరాలు ఉపయోగిస్తే మూడు అక్షరాల సమూహంగా నాలుగు అక్షరాలు ఉపయోగిస్తే నాలుగు అక్షరాల సమూహంగా విభజించే అవకాశం ఉంది. అలా కాని పక్షంలో

1. సిరీస్‌లో మొత్తం 12 ఉంటే(ఖాళీలు, అక్షరాలు కలిసి) 3 లేదా 4గా విభజించే అవకాశం ఎక్కువ.
2. సిరీస్‌లో మొత్తం 16 ఉంటే(ఖాళీలు, అక్షరాలు కలిసి) 4గా విభజించే అవకాశం ఎక్కువ.
3. సిరీస్‌లో మొత్తం 15 ఉంటే(ఖాళీలు, అక్షరాలు కలిసి) 3 లేదా 5గా విభజించే అవకాశం ఎక్కువ
4. సిరీస్‌లో మొత్తం 20 ఉంటే(ఖాళీలు, అక్షరాలు కలిసి) 4 లేదా 5 విభజించే అవకాశం ఎక్కువ
5. సిరీస్‌లో మొత్తం 14 ఉంటే(ఖాళీలు, అక్షరాలు కలిసి) 2/3/4/5 గా విభజించవచ్చు.

ఉదా: PQ/PQQ/PQQQ/PQQQQ

ప్రతి సమూహంలో 'Q' ఒక్కొక్కటి పెరిగింది.

6. సిరీస్‌లో 18 ఉంటే(అక్షరాలు, ఖాళీలు కలిసి) 3 లేదా 4 లేదా 6గా విభజించే అవకాశం ఎక్కువ ఒక్కోసారి 3/4/5/6గా కూడా ఉండే అవకాశం ఉంటుంది.

ఉదా: abc/aabc/aabbc/aabbcc.

మొదటి సమూహం నుంచి రెండో సమూహానికి a పెరిగింది. రెండో సమూహం నుంచి మూడో సమూహానికి b పెరిగింది. మూడో సమూహం నుంచి 4వ సమూహానికి c పెరిగింది. ఈ లెటర్ సిరీస్‌కు సంబంధించి ప్రశ్నలు ఏవిధంగా ఉంటాయో, గత వివిధ పోటీ పరీక్షలలో ఇస్తున్న, ముఖ్యమైన సిరీస్ పద్ధతులను అభ్యర్థులకు ఈ చాప్టర్‌పై అవగాహన కలిగించేందుకు దిగువ ఇస్తున్నాం. దిగువ ఇచ్చిన సిరీస్ పద్ధతులను అభ్యర్థులు కనీసం ఐదు లేదా ఆరుసార్లు చదివి జాగ్రత్తగా పరిశీలించి సిరీస్‌లో అక్షరాల విభజన, సిరీస్‌లు ఏర్పడే విధానం, వాటి స్వభావంపై అవగాహన ఏర్పరచుకొని ఈ చాప్టర్‌పై పట్టుసాధించగలరని ఆశిస్తున్నాం.

ఈ విభాగానికి సంబంధించిన ప్రశ్నల్లో ఉండే అక్షరాలు P, Q, R, S లేదా a,b,c,d లేదా K,L,M,N అయి ఉంటాయి.

వివిధ రకాలైన సిరీస్ పద్ధతులు

1. ab/ab/ab/ab/ab/ab

రెండేసి అక్షరాలు ఒక సమూహంగా రిపీట్ అవుతున్నది.

2. PQR/PQR/PQR/PQR

మూడేసి అక్షరాలు ఒక సమూహంగా రిపీట్ అవుతున్నది.

3. dcab/dcab/dcab/dcab

నాలుగేసి అక్షరాలు ఒక సమూహంగా రిపీట్ అవుతున్నది.

4. adcbc/adcbc/adcbc

ఐదేసి అక్షరాలు ఒక సమూహంగా రిపీట్ అవుతున్నది.

5. dacbad/dacbad/dacbad

ఆరేసి అక్షరాలు ఒక సమూహంగా రిపీట్ అవుతున్నది.

6. abba/baab/abba/baab

మొదటి సమూహంలో గల అక్షరాలు abba. ఈ సమూహంలో చివరి రెండు అక్షరాలు(ba) రెండో సమూహంలో మొదటి రెండు అక్షరాలుగా, మొదటి సమూహంలో మొదటి రెండు అక్షరాలు(ab) రెండో సమూహంలో చివరి రెండు అక్షరాలుగా ఉన్నాయి.

రెండో సమూహంలో చివరి రెండు అక్షరాలు (ab) మూడో సమూహంలో మొదటి రెండు అక్షరాలుగా, రెండో సమూహంలో మొదటి రెండు అక్షరాలు (ba) మూడో సమూహంలో చివరి రెండు అక్షరాలుగా ఉన్నాయి. ఈ విధంగా ఒక క్రమపద్ధతిని అనుసరిస్తూ ఈ సిరీస్ ఏర్పడింది.

7. PQ/PPQQ/PPPQQQ/PPPPQQQQ

మొదటి సమూహంలో రెండు అక్షరాలు, రెండో సమూహంలో నాలుగు అక్షరాలు, మూడో సమూహంలో ఆరు అక్షరాలు, నాలుగో సమూహంలో ఎనిమిది అక్షరాలు ఉన్నాయి. మొదటి సమూహంలో ఒక PQ, రెండో సమూహంలో రెండు Pలు, రెండు Qలు, మూడో సమూహంలో మూడు Pలు, మూడు Qలు ఉన్నాయి. ఈ విధంగా ఒక క్రమపద్ధతిని ఈ సిరీస్ అనుసరించింది.

8. abc/aabc/aabbc/aabbcc

మొదటి సమూహంలో మూడు అక్షరాలు, రెండో సమూహంలో నాలుగు అక్షరాలు, మూడో సమూహంలో ఐదు అక్షరాలు, నాలుగో సమూహంలో ఆరు అక్షరాలు ఉన్నాయి. రెండో సమూహాన్ని గమనిస్తే మొదటి సమూహంలో గల అక్షరాలన్నీ ఉంటూ a స్థానం వద్ద మరొక a అదనంగా చేరింది. మూడో సమూహంలో రెండో సమూహంలో గల అక్షరాలన్నీ ఉంటూ b స్థానం వద్ద మరో b అదనంగా చేరింది. నాలుగో సమూహంలో మూడో సమూహంలో గల అక్షరాలన్నీ ఉంటూ c స్థానం వద్ద మరో c అదనంగా చేరింది. ఈ విధంగా ఒక క్రమపద్ధతిని ఈ సిరీస్ అనుసరించినది.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్,
సీనియర్ ఫ్యాకల్టీ

వరదపై ఆగని జగన్ బురద

- వలంటీర్లు ఉంటే సమర్థంగా ఎదుర్కొనేవారట!
- ఎక్స్ వేదికగా జగన్ ట్వీట్.. విరుచుకుపడ్డ నెటిజన్లు
- జగన్ నిర్వాకమే ఈ వరద అంటూ మండిపాటు

అమరావతి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ అధినేత జగన్ వరదపై తన బురద రాజకీయాన్ని కొనసాగిస్తూనే ఉన్నారు. వలంటీర్లు ఉంటే, ముంపును సమర్థవంతంగా ఎదుర్కొనేవారంటూ మరోసారి విషం కక్కారు. అసలు రాష్ట్రంలో ప్రభుత్వం అనేది ఉందా... లక్షల మంది ఉద్యోగులున్న ప్రభుత్వ యంత్రాంగం ఏమైపోయిందంటూ ఆదివారం ట్వీట్ చేశారు. ప్రభుత్వం మారకపోతే, వైసీపీ తరఫున పోరాటం చేస్తామన్నారు. నిజానికి, ఐదేళ్లపాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన అనుభవం కలిగిననేతగా, భుజం భుజం కలిపి, వరద బాధితులకు సాయమందించాల్సిన తరుణమిది. అది వదిలేసి జగన్ ట్వీట్ చేసిన బురద రాజకీయ వ్యాఖ్యల పట్ల జల వనరుల నిపుణుల నుంచి ప్రభుత్వ అధికారులు, బాధితులు, నెటిజన్లు వరకు.. సర్వత్రా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇదంతా మీ నిర్వాకమే..రాజకీయాలకు ఇదా సమయం అంటూ అత్యధిక నెటిజన్లు విరుచుకుపడ్డారు. సోషల్ మీడియాలో విమర్శలు మాని ఆకలి కేకలు పెడుతున్న బాధితులకు సాయం చేయాలంటూ ఘాటుగా సూచించారు.

వైసీపీ ఎత్తులు చిత్తు

వరద బాధితులకు పరామర్శ పేరిట రాద్ధాంతం చేసేందుకు ప్రయత్నించిన జగన్ ప్రయత్నాన్ని ఇటీవల వరదప్రాంతాల్లో మహిళలే వమ్ము చేశారు. తమకు ప్రభుత్వం నుంచి అన్నివిధాలా సాయమందుతోందంటూ స్పష్టంచేశారు. ఏమీరెంత సాయం అందిస్తున్నారంటూ పరామర్శకు వచ్చిన ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణను మహిళలు నిలదీశారు. దీంతో, బయటకు రాకుండా తాడేపల్లి ప్యాలెస్‌కే పరిమితమైన జగన్ .. ఎక్స్ వేదికగా మాత్రం బురద రాజకీయాలకు తెరతీశారని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులను కించపరిచేలా ఉన్న జగన్ వ్యాఖ్యలను పలువురు తీవ్రంగా తప్పుబడుతున్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో వినాయక చవితి సెలవు దినం కూడా ఉద్యోగులు పనిచేసిన విషయం వారు గుర్తుచేశారు.

బ్రహ్మాజీ కౌంటర్ ట్వీట్...

జగన్ ట్వీట్‌కు సినీనటుడు బ్రహ్మాజీ కౌంటర్ ట్వీట్ చేశారు. 'మీరు కరెక్టు సార్. వాళ్లు చెయ్యలేరు సార్. ఇకనుంచి మనం చేద్దాంసార్. ఫస్ట్ మనం రూ.1000 కోట్లు రిలీజ్ చేద్దాం సర్. మన వైసీపీ కేడర్ మొత్తాన్ని రంగంలోకి దింపుదాం. మనకు జనాలు ముఖ్యం సార్. గవర్నమెంటు కాదు సార్. మనం చేసి చూపిద్దాం సార్. జై జగన్ అన్న' అని ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు. అయితే, ఆ ట్వీట్ తాను చేయలేదని, తన ఖాతా హ్యాక్ అయిందని, ఫిర్యాదు కూడా చేశానని బ్రహ్మాజీ వివరణ ఇచ్చారు.

దుష్ప్రచారాన్ని సహించొద్దు..

- సోషల్ మీడియాలో పోస్టులపై ప్రభుత్వం సీరియస్
- మితిమీరితే ఊరుకోబోనని ముఖ్యమంత్రి హెచ్చరిక

అమరావతి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వరద సహాయ కార్యక్రమాలపై సామాజిక మాధ్యమాల్లో చేస్తున్న దుష్ప్రచారంపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా ఉంది. ఆ పోస్టులు పెడుతున్నవారెవరో ఆరా తీయాలని నిర్ణయించింది. మితిమీరితే శిక్ష తప్పదని హెచ్చరిస్తోంది. తాజాగా వరద సాయం విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంబంధాలపై అనుమానాలు రేకెత్తించేలా సోషల్ మీడియాలో పోస్టులు మొదలయ్యాయి. ఇంతవరకూ కేంద్రం సాయం ప్రకటించకపోవడంపై చంద్రబాబు ప్రభుత్వం అసహనంగా ఉందని... దీంతో ఇరు ప్రభుత్వాల మధ్య సంబంధాలు దెబ్బ తిన్నాయని ఈ పోస్టుల్లో పేర్కొంటున్నారు. కొద్ది రోజుల్లో కేంద్ర మంత్రివర్గం నుంచి టీడీపీ బయటకు వచ్చేసి, ఎన్డీయే కూటమికి గుడ్ బై చెబుతుందనే ప్రచారం చేస్తున్నారు. కేంద్ర సాయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు రెండు రోజుల క్రితమే స్పష్టత ఇచ్చారు. తాము నష్టానికి సంబంధించి ప్రాథమిక నివేదిక పంపకుండానే కేంద్రం సాయం ప్రకటించడం సాధ్యం కాదని, తాము ఇంకా నివేదిక పంపలేదని చెప్పారు. ఎమరీ అతిగా ప్రవర్తిస్తున్నారు. వైసీపీ నుంచే ఇటువంటి దుష్ప్రచారం నడుస్తోంది. మరీ మితిమీరిపోతే మేం సీరియస్‌గా తీసుకుంటాం. దానికి తగిన శిక్ష ఉంటుంది' అని హెచ్చరించారు.

బెజవాడ అనుభవంతో భద్రం!

- భారీ వర్షాలతో ఉత్తరాంధ్రకు వరద ముప్పు
- ప్రాణ, ఆస్తి, పంట నష్టం తగ్గించాలి
- ప్రజల ఫోన్లకు అలర్ట్ మెసేజ్‌లు
- ఆహార సరఫరాకు డ్రోన్లు వాడండి
- ఏలేరు ప్రాజెక్టు వద్ద గట్టి చర్యలు
- కలెక్టర్లు, ఎస్పీలతో సీఎం టెలికాన్ఫరెన్స్

అమరావతి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో కురుస్తున్న భారీవర్షాలతో ప్రజలు ఇబ్బంది పడకుండా పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని అధికార యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. విజయవాడ వరదను గమనంలో ఉంచుకుని ముందస్తు చర్యలను వేగంగా తీసుకోవాలని సూచించారు. ప్రభావిత ప్రాంతాల ప్రజల ఫోన్లకు అలర్ట్ మెసేజ్‌లు పంపాలని కోరారు. ఆదివారం జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, సంబంధిత అధికారులతో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. "ఉత్తరాంధ్ర జిల్లాల్లో వరదల ప్రభావం కనిపిస్తోంది. అన్ని జిల్లాల కలెక్టర్లు కూడా అప్రమత్తం కావాలి. నాగావళి, వంశధార నదులకు వరద పెరిగే అవకాశం ఉంది. ఏలేరు రిజర్వాయర్‌కు ఎక్కువ వరద నీరు రావొచ్చు. ప్రాజెక్ట్‌లోకి వచ్చే ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో బ్యాలెన్స్ చేసుకుని, సమర్థవంతంగా వ్యవహరించాలి. కాలువలు, చెరువులు, డ్రెయిన్లకు గండ్లు పడకుండా చూసుకోవాలి. భారీ, అతిభారీ వర్షాలు పడేందుకు అవకాశం ఉన్న ప్రాంతాల్లో తాగునీరు, ఆహారం, మెడికల్ క్యాంప్‌లను సిద్ధం చేయాలి. ప్రజలను నిరంతరం అప్రమత్తం చేస్తూ, ప్రాణనష్టం లేకుండా చూసుకోవాలి. ముందస్తు చర్యలతో ఆస్తి నష్టాన్ని తగ్గించాలి. పంట నష్టం అంచనా, బాధితులకు ఆహార సరఫరా, వరద పరిస్థితులను గమనించేందుకు డ్రోన్లు వినియోగించాలి. ప్రభావిత ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలి. అక్కడ వారికి అన్ని వసతులు కల్పించాలి. పరిస్థితి తీవ్రతను బట్టి, సహాయం కోసం సెంట్రల్ కంట్రోల్ టీమ్‌ను సంప్రదించాలి. ఏజెన్సీలో వాగులు, వంకలు దాటే సమయంలో ప్రజలు ప్రమాదాల బారిన పడకుండా చూడాలి. వినాయకుని నిమజ్జనం కోసం చెరువులు, కాలువల వద్దకు వెళ్లే భక్తులు, ప్రమాదాలబారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. జిల్లాలవారీగా వర్షపాతం వివరాలను సీఎంకు కలెక్టర్లు వివరించారు. బాపట్ల జిల్లాలోని పునరావాస కేంద్రాల్లో పెరుగుతున్న బాధితులను దృష్టిలో ఉంచుకుని ఏర్పాట్లు పెంచుతున్నామని ఆ జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. రెండువేల మందికి పైగా ఇప్పటికే పునరావాస కేంద్రాలకు తరలించి, ఆహారం అందిస్తున్నామని ఏలూరు కలెక్టర్ కె. వెట్రి సెల్వి చెప్పారు. విజయనగరంజిల్లాలో భారీ వర్షాలకు అనుగుణంగా రాకపోకలను నియంత్రిస్తున్నామని కలెక్టర్ అంబేడ్కర్ వివరించారు.



వరద పరిస్థితిని గవర్నర్‌కు వివరిస్తున్న సీఎం చంద్రబాబు

పండుగ రోజూ పరామర్శలే

ముఖ్యమంత్రి చంద్రబాబు వినాయకచవితి పండగ రోజు కూడా వరద బాధితులను పరామర్శించేందుకు విజయవాడలో పర్యటించారు. సింగ్‌నగర్‌లో వరదనీరు ఉండటంతో పొక్లెయిన్ ఎక్కి మారుమూల ముంపు ప్రాంతాలకు వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ఓవైపు వర్షం.. మరోవైపు వరద నీటిలోనే సుమారు మూడు గంటలపాటు సీఎం పర్యటన కొనసాగింది. బాధితులు తమ కష్టాలను ఆయనకు చెప్పుకొన్నారు. తీవ్రంగా నష్టపోయామని, ఇంట్లో ఉన్న వస్తువులు, వాహనాలు అన్నీ దెబ్బతిన్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గండ్లు పూడ్చివేయడంతో వరద నీరు ఒకటి రెండు రోజుల్లో తగ్గిపోతుందని, ప్రతి ఒక్క కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందని చంద్రబాబు...బాధితులకు భరోసా ఇచ్చారు. అనంతరం కాన్వాయ్‌లో తిరిగి విజయవాడ కలెక్టరేట్‌కు చేరుకున్నారు.

గవర్నర్‌ను కలిసిన చంద్రబాబు

- ప్రభుత్వ కృషిని ప్రశంసించిన అబ్దుల్ నజీర్

అమరావతి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదివారం ఇక్కడ కలిశారు. విజయవాడలోని రాజ్ భవన్‌కు వెళ్లిన ఆయన గవర్నర్‌తో సుమారు గంటపాటు భేటీ అయ్యారు. విజయవాడ నగరాన్ని కనీవినీ ఎరుగని రీతిలో వరదలు ముంచెత్తడంతో ఆయన గవర్నర్‌ను కలసి ఈ పరిణామాలను వివరించారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో కూడా వరదల వల్ల జరిగిన నష్టం, బాధితులను ఆదుకోవడానికి తాము తీసుకొన్న చర్యలను చెప్పారు. ప్రభుత్వం సత్వరం స్పందించి యుద్ధ ప్రాతిపదికన బాధితులను ఆదుకోవడానికి తీసుకొన్న చర్యలను గవర్నర్ ఈ సందర్భంగా ప్రశంసించారు. ముఖ్యమంత్రి వ్యక్తిగతంగా బాధ్యత తీసుకొని సహాయ కార్యక్రమాలను పర్యవేక్షించడాన్ని మెచ్చుకొన్నారు. త్వరలోనే ముంపు ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులు నెలకొనగలవన్న ఆశాభావాన్ని గవర్నర్ వ్యక్తం చేశారు.

నేటి నుంచి నష్టం అంచనా

- 2.32 లక్షల నివాసాల్లో సర్వే
- వ్యాపార సంస్థల నష్టం కూడా
- కుటుంబ సభ్యులెవరున్నా నమోదు
- ధ్రువీకరణ కోసం ఆధార్ తప్పనిసరి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన వెల్లడి

విజయవాడ/అమరావతి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లాలోని వరద ముంపు ప్రాంతాల్లో ఆస్తి నష్టాన్ని అంచనా వేసే కార్యక్రమం సోమవారం ప్రారంభం కానుంది. 2.32 లక్షల గృహాలతోపాటు వాణిజ్య, వ్యాపార సంస్థలకు జరిగిన నష్టాన్ని అంచనా వేయనున్నారు. దీనికిగాను రెవెన్యూ, సచివాలయ సిబ్బందితో 17 వేల బృందాలను ఏర్పాటు చేశారు. నష్టం అంచనా నమోదుకు ప్రత్యేక యాప్‌ను రూపొందించారు. ఈ బృందాలకు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి(రెవెన్యూ) ఆర్‌పీ సిసోడియా నేతృత్వంలో ఆదివారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శిక్షణ ఇచ్చారు. అనంతరం ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన మీడియాతో మాట్లాడుతూ ఎన్యూమరేషన్‌కు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఒక్కో బృందానికీ డిప్యూటీ తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నేతృత్వం వహిస్తారని తెలిపారు. వారితోపాటు వార్డు సెక్రటరీ, వలంటీర్, పోలీసు సిబ్బంది ఒకరు ఉంటారన్నారు. మూడు రోజుల్లో నష్టాన్ని నమోదు చేస్తామన్నారు. ఎన్యూమరేషన్ ప్రక్రియను పర్యవేక్షించేందుకు ప్రతి వార్డుకు ఒక ఐఏఎస్ అధికారితోపాటు జిల్లా అధికారి ఒకరు పనిచేస్తారని తెలిపారు.

అందుబాటులో ఉండాలి!

ఎన్యూమరేషన్ బృందాలు వచ్చిన సమయంలో గృహ, వ్యాపార సంస్థల యజమానులు అందుబాటులో ఉండాలని కలెక్టర్ సృజన కోరారు. ఇళ్లకు తాళాలు వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు తిరిగి వస్తే ఎన్యూమరేషన్‌కు ఇబ్బంది లేకుండా ఉంటుందని సూచించారు. ఏదైనా కారణం వల్ల ఇంట్లో ఎవరూ లేకుంటే వార్డు సెక్రటరీకి సమాచారం ఇస్తే మరోసారి ఇంటికి వచ్చి ఎన్యూమరేషన్ చేస్తారని వివరించారు.

ఇళ్లే మొదట

తొలుత గృహాల్లో నష్టం అంచనాకు ప్రాధాన్యం ఇస్తారని కలెక్టర్ చెప్పారు. ఆ తర్వాత ఆటోలు, రిక్షాలు, తోపుడు బండ్లు తదితరాలకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. కాగా, విద్యార్థులతో కూడిన మరికొన్ని బృందాలు సమాంతర సర్వే నిర్వహించనున్నాయి.

వరద నష్టం 6,882 కోట్లు

- కేంద్రానికి రాష్ట్రం ప్రాథమిక నివేదిక

అమరావతి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): వరదల కారణంగా రూ.6,882 కోట్ల మేరకు నష్టం వాటిల్లిందని రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమికంగా అంచనా వేసింది. క్షేత్రస్థాయిలో ఎన్యూమరేషన్ అనంతరం నష్టం మరింత పెరిగే అవకాశం ఉందని తెలిపింది. వరద నష్టంపై కేంద్ర ప్రభుత్వానికి శనివారం ప్రాథమిక నివేదికను పంపింది. రోడ్లు భవనాల శాఖకు రూ.2,165 కోట్ల నష్టం వాటిల్లిందని పేర్కొంది. జలవనరుల శాఖకు 1,569 కోట్లు, పట్టణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖలకు 1,160 కోట్లు, పశు సంవర్థక శాఖకు రూ.12 కోట్లు, వ్యవసాయ శాఖకు 301 కోట్లు, మత్స్య శాఖకు 158 కోట్లు, ఉద్యానవన శాఖకు 40 కోట్లు, విద్యుత్ శాఖకు 481 కోట్లు గ్రామీణ నీటి పారుదల శాఖకు 76 కోట్లు, పంచాయితీరాజ్ పరిధిలోని రోడ్లకు 168 కోట్లు, అగ్నిమాపక శాఖకు 2 కోట్ల నష్టం జరిగినట్టు వివరించింది.

వాహనాల రిపేర్ ఖర్చు

కొంత భరిస్తాం

- ఇళ్లలో పాడైన పరికరాలకూ మరమ్మతులు
- తక్కువ ఖర్చైతే మేమే పెట్టుకొంటాం
- కంపెనీలు, బ్యాంకర్లతో చర్చలు
- ఒకటి, రెండు రోజుల్లో దీనిపై స్పష్టత
- రోడ్ల శుభ్రతపై డ్రోన్లతో తనిఖీ: సీఎం చంద్రబాబు

అమరావతి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విజయవాడ వరదల్లో మునిగిపోయి దెబ్బతిన్న వాహనాలు, ఇళ్లలో పరికరాల రిపేర్ల ఖర్చులో కొంత ప్రభుత్వం భరించడంపై ఆలోచన చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. ఒకటి, రెండు రోజుల్లో దీనిపై స్పష్టత వస్తుందని ఆయన తెలిపారు. ఆదివారం రాత్రి విజయవాడ కలెక్టరేట్ ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడారు. "వరదల్లో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు తదితర వాహనాలు పెద్ద సంఖ్యలో మునిగిపోయి దెబ్బ తిన్నాయి. వీటిలో కొన్నింటికి బీమా ఉంది. కొన్నింటికి లేదు. ఆథరైజ్డ్ మెకానిక్కుల వద్ద రిపేర్ చేయిస్తేనే బీమా వస్తుంది. కొందరు యజమానులు తమకు నమ్మకం ఉన్నవారి వద్ద రిపేర్ చేయించుకోవాలని అనుకొంటారు. బీమా లేని వాహనాల రిపేర్లు ఎలాగో ఆలోచించాలి. వాహనాల కంపెనీలతో ఈ విషయం మాట్లాడుతున్నాం. కంపెనీల వద్ద సీఎస్‌ఆర్ నిధులు ఉంటాయి. వాటి కింద ఉచితంగా రిపేర్లు చేయాలని అడుగుతున్నాం. తక్కువ ఖర్చయితే ప్రభుత్వం తరఫున మేం పెట్టుకొంటాం. మరీ ఎక్కువైతే కొంత ప్రభుత్వం...కొంత యజమానులు భరించేలా ఆలోచన చేస్తున్నాం. వరద ప్రాంతాల్లోని ఇళ్లలో రకరకాల ఎలక్ట్రానిక్ పరికరాలు పాడై పోయాయి. వాటిని ఆయా కంపెనీల తయారీదారులే మరమ్మతు చేయాలి. విడి భాగాలు వాళ్ల వద్దే ఉంటాయి. ఆ కంపెనీలతో కూడా మాట్లాడి తక్కువ ఖర్చుతో రిపేర్లు అయ్యే మార్గం అన్వేషిస్తున్నాం. ఇందులో కూడా వీలైతే కొంత ఖర్చు ప్రభుత్వం పెట్టుకొంటుంది. గ్యాస్ స్టవ్‌లు కూడా వాటిని కొన్న కంపెనీలే రిపేర్ చేయాలి. వాళ్లతో కూడా మాట్లాడుతున్నాం. ఎలక్ట్రికల్, ప్లంబింగ్, కార్పెంటరీ, పెయింటింగ్ వంటి పనులు అర్బన్ కంపెనీకి అప్పగిస్తున్నాం. ఆ కంపెనీకి ఇందులో ప్రావీణ్యం ఉంది. ఇతరత్రా ఎవరైనా ఈ పనులు చేసే వాళ్లు ఉంటే వాళ్లను కూడా ఈ కంపెనీకే అప్పగిస్తున్నాం. రేట్లు తక్కువలో ఉండేలా చూస్తాం. ఇవన్నీ ఒకటి రెండు రోజుల్లో తేలతాయి. వీటన్నింటిపైనా వివరంగా ఒక కరపత్రం తయారు చేసి ఇంటింటికీ పంపిస్తాం" అని ఆయన వివరించారు. చిన్న వ్యాపారాలు చేసుకొనేవారు, షాపులు నిర్వహించేవారు, పెద్ద వ్యాపారాలు చేసేవారు అందరూ నష్టపోయారని, వాళ్లను తిరిగి ఎలా గాడిలో పెట్టాలన్నదానిపై బ్యాంకర్లతో మాట్లాడుతున్నామని, కేంద్రం సహాయం కూడా కోరుతున్నామని ఆయన వివరించారు.

శుభ్రతపై డ్రోన్లతో తనిఖీ

వరద తగ్గిన తర్వాత ముంపు ప్రాంతాల్లో రోడ్లు, కాల్వలు శుభ్రం చేయిస్తున్నామని, ఎలా శుభ్రం చేశారో డ్రోన్లతో తనిఖీ చేయిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. డ్రోన్లు తీసిన వీడియోలు, ఫొటోలను క్షేత్రస్థాయిలో పని చేయించేవారికి పంపి ఎక్కడైనా సరిగ్గా చేయకపోతే మళ్లీ చేయిస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లపాటు డ్రెయిన్లు శుభ్రం చేయలేదని, వరద కాల్వల పనులు నిలిపివేసిందని ఆయన విమర్శించారు. విజయవాడలో రెండు రోజుల్లో సాధారణ పరిస్థితులు నెలకొంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు. 'బుడమేరు కింద ఆక్రమణలు తొలగిస్తాం. ఈ నీరు సముద్రం చేరేవరకూ ఆటంకాలు లేకుండా అన్నీ తొలగిస్తాం. మళ్లీ విజయవాడకు వరద రాకుండా చేస్తాం' అన్నారు. ఈ 8 రోజుల్లో మొత్తం 97 లక్షల ఆహార ప్యాకెట్లు సరఫరా చేశామన్నారు.

కాజలో గణపతి స్వామికి వెండి మకర తోరణం

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 8: మంగళగిరి మండలం కాజ గ్రామంలోని అగస్త్యేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న గణపతి స్వామికి దాతలు వెండి మకర తోరణం, కిరీటం, తొండం బహూకరించారు. గ్రామానికి చెందిన ఆలా వెంకటేశ్వరరావు, పద్మావతి దంపతులు 11.5 కిలోల వెండితో తయారు చేయించిన రూ.14 లక్షల విలువ చేసే ఈ ఆభరణాలను కానుకగా సమర్పించారు. వినాయక చవితి సందర్భంగా మకర తోరణం, కిరీటం, తొండంను మేళ తాళాలతో ఊరేగింపుగా తీసుకువచ్చి స్వామి వారికి అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద కాపులు సింహాద్రి వెంకట రామారెడ్డి, కక్కల కోటేశ్వరరావు, చెన్నం శ్రీనివాసరావు, బొమ్ము పిచ్చిరెడ్డి, నేతలు గాదె పిచ్చిరెడ్డి పల్లబోతుల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



గణపతికి మకర తోరణం అలంకరించి పూజలు చేస్తున్న దాతలు



మండలపరిధి కేఆర్‌కొండూరులో పునర్నిర్మాణం జరుగుతున్న మహంకాళీ అమ్మవారి ఆలయాభివృద్ధికై చిలువూరు గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు బొడ్డపాటి శంకర్, అరుణ దంపతులు, రూ.లక్షా116ల చెక్కును ఈవో చినకోటి రెడ్డికి ఆదివారం అందించారు. అర్చకులు తారక్‌నాథ్‌శర్మ దాతలకు అమ్మవారి చిత్రపటాన్ని అందజేసి శాలువాతో సత్కరించారు. **(దుగ్గిరాల)**

ఇన్‌చార్జి ఎంపీపీగా జబీన్.. నేడు బాధ్యతల స్వీకరణ

దుగ్గిరాల సెప్టెంబరు 8: మండలగ్రామం చిలువూరు ఎంపీటీసీ సభ్యురాలు ప్రస్తుత మండల ఉపాధ్యక్షురాలు షేక్ జబీన్ మండల ఇన్‌చార్జి అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఎంపీపీగా అన్ని అర్హతలు కలిగి, టీడీపీ, జనసేనకు చెందిన మెజార్టీ సభ్యుల మద్దతున్నప్పటికీ, బీసీ ధ్రువీకరణపత్రం ఇవ్వక పోవడంతో మండలాధ్యక్షురాలి పదవి చేజారిన విషయం విదితమే. కాగా ఇటీవల వరకూ ఎంపీపీగా కొనసాగుతున్న వైసీపీకి చెందిన దానబోయిన సంతోష రూపవాణి రాజీనామా చేయడంతో ఆమె స్థానంలో ఇన్‌చార్జిగా జబీన్ సోమవారం బాధ్యతలు స్వీకరిస్తారు. త్వరలో మెజార్టీసభ్యుల మద్దతుతో ఎంపీపీగా బాధ్యతలు స్వీకరించడం ఖాయమని టీడీపీ వర్గీయులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.



షేక్ జబీన్

టీడీపీ ఫ్లెక్సీ చించివేతపై ఫిర్యాదు

దుగ్గిరాల, సెప్టెంబరు 8: మండలంలోని శృంగారపురంలో నారా లోకేశ్‌తో పాటు టీడీపీ నాయకుల ఫోటోలున్న భారీ ఫ్లెక్సీని వైసీపీ వర్గీయులు శుక్రవారం రాత్రి చించివేశారని, స్థానిక టీడీపీ నాయకులు, పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. స్థానికంగా ఏర్పాటు చేసిన వినాయక ఉత్సవాల సందర్భంగా పలువురు యువకులు బైక్‌లపై తిరుగుతూ, హల్‌చల్ చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. వివరాలు తెలియాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదంలో నంద్యాల వాసి మృతి

ప్రత్తిపాడు, సెప్టెంబరు 8: మండలపరిధిలోని జాతీయ రహదారి బోయపాలెం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నంద్యాల జిల్లాకు చెందిన వ్యక్తి అక్కడికక్కడే మరణించారు. ప్రత్తిపాడు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం పోతురెడ్డి గ్రామానికి చెందిన మరమోసి బాబు విజయవాడ నుంచి అనంతపురంనకు ఐచర్ వ్యానును తీసుకుని బయలు దేరాడు. ఆదివారం తెల్లవారు ఝామున సుమారు మూడు గంటల సమయంలో ముందు వెలుతున్న ట్రాక్టర్‌ను తప్పించబోయి వెనుక నుంచి గుద్దడంతో పాటు పక్కనే ఉన్న మరో లారీని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ఐచర్ వ్యాను డ్రైవర్ బాబు అక్కడికక్కడే మరణించగా, ట్రాక్టర్ డ్రైవర్‌కు గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాడవాడలా కొలువు దీరిన గణనాథులు

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 8: వినాయక చవితి వేడుకలను మంగళగిరి ప్రజలు శనివారం ఘనంగా జరుపుకున్నారు. వాడవాడలా విభిన్న రూపాల్లో ఉన్న గణనాథులను ఏర్పాటుచేసి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. పట్టణంలో కస్తూరి కంగన్ హాలు వద్ద, పాతమంగళగిరి సీతా రామస్వామి కోవెల, జీఆర్ స్కూల్, సీపీఐ స్థూపం వద్ద ఏర్పాటు చేసిన గణనాథులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వినాయక చవితి రోజున వివిధ సంఘాల ఆధ్వర్యంలో భక్తులకు ఉచితంగా మట్టి గణనాథుని ప్రతి మలను పంపిణీ చేశారు. గణేశ్ మండపాల వద్ద నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తూ రోజూ భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేస్తున్నా రు. పలుచోట్ల ఆదివారం విగ్రహాలను నిమజ్జనోత్సవానికి తరలించారు.



పాతమంగళగిరి సీతారామస్వామి కోవెల వద్ద విఘ్నేశ్వరుడు



దుగ్గిరాల రథం సెంటర్‌లో భారీ వినాయకుడు

2 వేల మంది భక్తులకు అన్నదానం

తాడేపల్లి, సెప్టెంబరు 8: వినాయక చవితి సందర్భంగా ఆదివారం తాడేపల్లి కృష్ణుడు గుడివద్ద గణేష్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో సుమారు 2వేల మందికి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో తాడేపల్లి ఎస్‌ఐ సుబ్బారావు, సింకా గంగాధరరావు, దానబోయిన సుందరరావు యాదవ్, టీఎన్నార్ మాస్టారు, తాడిబోయిన బాబు, గణేష్ ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు సింకా నాగవంశీ తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాల మండలంలో..

దుగ్గిరాల సెప్టెంబరు 8: మండలంలోని పలు గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాలు శనివారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు మట్టి వినాయకు లను సిద్ధం చేసి పలువురు గ్రామస్థులకు అందించడంతోపాటు, తమ ఇళ్లకు తీసుకెళ్లి ఎకో గణపతి ని పూజిస్తామని సందేశాన్ని ప్రజలకు చెప్పడం విశేషం. హెచ్‌ఎం శోభాదేవి, ఉపాధ్యాయులు అందించిన ప్రోత్సాహంతోనే తాము మట్టి వినాయకులను తయారు చేశామని విద్యార్థినులు ఆనంద వ్యక్తం చేశారు. కొన్ని చోట్ల దళిత వాడల్లోనూ, ముస్లిం కాలనీల్లోని, చిన్నారులు సైతం వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసి మత సామరస్యాన్ని చాటుకున్నారు.



నల్లపాడు కన్నా టవర్స్‌లో వినాయక చవితి వేడుకలు

వట్టిచెరుకూరు, సెప్టెంబరు 8: మండలపరిధిలోని అన్ని గ్రామాల్లోశనివారం వినాయక చవితి ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో పందిళ్లు వేసి విగ్రహాలు ఏర్పాటు చేశారు.

పెదనందిపాడు మండలపరిధిలో..

పెదనందిపాడు, సెప్టెంబరు 8 : మండలపరిధిలోని ఆయా గ్రామాల్లో శనివారం వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయా కమిటీల ఆధ్వర్యంలో గణపతి నవరాత్రుల్లో భాగంగా మండపాల వద్ద గణనాథులను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాకతీయ సేవాసమితి ఆధ్వర్యంలో పోలేరమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక ఉత్సవాల్లో గణపతి హోమాన్ని శంకరగురుస్వామి నిర్వహించారు.

నిమజ్జనానికి తరలిన గణనాథులు

మండలపరిధిలోని ఆయా గ్రామాల్లో గణపతి నవరాత్రుల్లో భాగంగా విశేష పూజలందుకున్న గణనాథులు ఆదివారం నిమజ్జనానికి తరలివెళ్లారు. పుసులూరు, అన్నపర్రు, గోగులమూడి గ్రామాల్లో పెదనందిపాడులోని పోలేరమ్మ దేవస్థానం వద్ద కాకతీయ సేవాసమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథులను ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్లపై వీధుల్లో ఊరేగింపు నిర్వహించి సూర్యలంక సముద్ర తీరాన నిమజ్జనం చేశారు.

నల్లపాడులో..

నల్లపాడు(వేండి కొండవారు) సెప్టెంబరు 8: గుంటూరు రూరల్ మండలం నల్లపాడు కన్నా టవర్స్ అపార్ట్‌మెంట్‌లో వినాయక చవితి వేడుకలు ఘనంగా జరిగాయి. మండలంలోని పలు గ్రామాల్లో చవితి పందిళ్లలో వినాయ విగ్రహాలు ఏర్పాటు చేసి పూజలు చేశారు. వర్షం కురుస్తున్నా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు.

తుళ్లూరు మండలంలో..

తుళ్లూరు, సెప్టెంబరు 8: వివిధ సెంటర్లలో నెలకొల్పిన విఘ్నేశ్వర్లకు భక్త కమిటీలు గ్రామోత్సం నిర్వహించాయి. జోరు వానలో కూడా గణనాధులకు మహిళలు హారతులు ఇచ్చారు. తుళ్లూరు గీతా మందిరం సెంటర్లో 18 అడుగుల భారీ విగ్రహన్ని నెలకొల్పి ఊరేగించారు. ఈ వినాయకుడితో పాటు మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహాన్ని ట్రాక్టర్‌లో ఊరే గించారు. అదే ట్రాక్టర్‌కి సీఎం చంద్రబాబు చిత్రపటాన్ని ఏర్పాటు చేశారు. పలు గణనాధుల ఊరేగింపులో మహిళల కోలాటం సందడి చేసింది. తుళ్లూరు తూర్పు బజారు విఘ్నేశ్వరుడి ముందు కేరళ నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తుళ్లూరులోని గీతామందిరం, కొత్తూరు రామాలయం, లైబ్రరీ సెంటర్, బాలకోటయ్య సత్రం, తూర్పువీధి బస్టాండ్ సెంటర్లలో వినాయక చవితి నవరాత్రులు నిర్వహిస్తున్నారు.



పెదనందిపాడులో నిమజ్జనానికి వెళ్తున్న గణనాథుడు



తుళ్లూరులో గణనాధుల వద్ద మహిళల కోలాటం సందడి

రంగిశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 4000 మందికి ఆహారం

దుగ్గిరాల, సెప్టెంబరు 8: మండలంలోని చిలువూరుకు చెందిన ప్రముఖ ఫార్మా సంస్థ బయోఫర్ అధినేత డాక్టర్ రంగిశెట్టి జగదీష్‌బాబు, స్థానిక నాయకులు రంగిశెట్టి ఫౌండేషన్ ద్వారా 4000 ఆహార పొట్లాల ను వరదబాధితుల సహాయార్థం తరలించారు. గ్రామంలోని సొంతింటి వద్దనే సిద్ధం చేసి రంగిశెట్టి రమేష్ స్వయంగా ఓ వ్యానులో తమ సిబ్బందిని వెంటబెట్టుకుని తీసుకెళ్లారు. ముఖ్యమంత్రి నారా చంద్ర బాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ల వరద బాధితులను ఆదుకోవాలని ఇచ్చిన పిలుపు మేరకు ఐదు రోజులుగా తాడేపల్లి మహానాడు, విజయవాడ సింగ్‌నగర్, పాయకాపురం తదితర ముంపునకు గురై ఇంటి నుంచి బయటకు రాలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులకు ఆహారపొట్లాలను పంపిణీ చేయడం విశేషం. స్థానిక టీడీపీ నాయకులు తోటకూర సీతారామయ్య, షేక్ సాదిక్, జనసేన, బీజేపీ నాయకులు రంగిశెట్టి జగదీష్‌బాబు సేవలను అభినందించారు.

అశోక్‌లైలాండ్ మినీట్రక్ వాహనం ద్వారా తాడేపల్లి మహానాడు, సింగ్ నగర్‌లకు తరలించి, టీడీపీ జనసేన శ్రేణులతో పంపిణీ చేయించారు.



వరదబాధితులకు అందించేందుకు చిలువూరు నుంచి ఆహార పొట్లాల వాహనంతో రంగిశెట్టి రమేష్‌బాబు, టీడీపీ నాయకులు

పెదకొండూరు గ్రామం నుంచి జనసేన ఆధ్వర్యంలో విజయవాడ పరిసరాల్లోని వరదబాధితులకు అందించేందకు ఆహార పొట్లాలను ట్రాక్టర్‌లలో తరలించారు.

వైద్య శిబిరానికి స్పందన

తాడికొండ, సెప్టెంబరు 8: మండలపరిధిలోని నిడుముక్కల పంచాయతీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన వైద్యశిబిరానికి స్పందన లభించింది. టీడీపీ మండల అధ్యక్షుడు తలశిల ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో గుంటూరు రమేష్ హాస్పిటల్ సహకారంతో ఉచిత మెడికల్ క్యాంపును నిర్వహించారు. శిబిరంలో 130 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ యు.గజపతి రోగులకు గుండె, బీపీ,షుగర్, తదితర వైద్య పరీక్షలు చేశారు. రోగ నిర్ధార చేసిన వారికి ఉచితంగా మందులు పంపణీ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడు చిగురుపాటి అనూఫ్, గ్రామ అధ్యక్షుడు బండ్ల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మరియమాత జయంతి

ఫిరంగిపురం, సెప్టెంబరు 8: ఫిరంగిపురంలో జీసెస్ తల్లి మరియ మాత జయంతిని ఫిరంగిపురంలో ఆదివారం ఘనంగా జరిపారు. మరియతల్లి దేవునికి విధేయతను చూపి లోకానికే వెలుగైన జీసెస్‌కు జన్మనిచ్చిందన్నారు. కనుకనే మరియమాతను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని ఫాదర్ ఫాతిమా మర్రెడ్డి అన్నారు. ఫిరంగిపురంలోని కొత్తపేటలో గల స్వర్ణ మందిరంలో కేక్‌ను కట్ చేసి భక్తులకు పంపిణీ చేశారు. అలాగే విజ్ఞానపురం వద్ద మరియమాత మందిరం దివ్య పూజాబలి నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో గుడి పెద్దలు పాల్గొన్నారు.

నేటి ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 8: జిల్లాలో భారీ వర్షాల కారణంగా సోమవారం కలెక్టరేట్‌లో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

పోలీస్ కార్యాలయంలో కూడా..

గుంటూరు, సెప్టెంబరు 8: జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఈ సారి కూడా రద్దు చేశారు. బంగాళాఖాతంలో ఏర్పడ్డ వాయుగుండం నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎస్పీ తెలిపారు.

వరద బాధితులకు దుస్తుల పంపిణీ



ఉద్దండ్రాయునిపాలెంలో బాధితులకు దుస్తులు పంపిణీ చేస్తున్న మాజీ సర్పంచ్ బత్తుల కోటేశ్వరావు, విజయ్‌కుమార్

తుళ్లూరు, సెప్టెంబరు 8: మండలపరిధిలో ఉద్దండ్రాయునిపాలెం లంక వరద బాధితులకు దుస్తులను ఆదివారం గ్రామంలోని పునరావాస కేంద్రం చర్చి నందు పంపిణీ చేశారు. మహిళా సీనియర్ సిటిజన్ పాలడుగు అరుణ, అప్పసాని కృష్ణకుమారి వారి సహకారంతో బాధితుల ఒక్కో కుటుంబానికి రెండు చీరలు కండువా లుంగీ లను అందజేశారు. 130 కుటుంబాల వారికి యలమంచిలి విజయ్‌కుమార్, మాజీ సర్పంచ్ టీడీపీ అధ్యక్షుడు బత్తుల కోటేశ్వరరావు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.


తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 8: పట్టణంలోని సీఎస్సార్ కల్యాణమండపం రోడ్డులోని అమరావతి ఐకాన్ సమీపంలో ఉన్న శ్రీశ్రేయా ఎన్‌క్లేవ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మహానాడులోని 200 మంది వరద బాధితులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విజయవాడ కార్పొరేటర్ తాటిపర్తి కొండారెడ్డి పాల్గొని దుప్పట్లు అందజేశారు.

సాంఘిక నాటకాలతో చైతన్యం నింపిన గరికపాటి

మంగళగిరి, సెప్టెంబరు 8: సాంఘిక నాటకాలకు ప్రాధాన్యమివ్వడం ద్వారా సమాజంలో చైతన్యం నింపిన మహోన్నత వ్యక్తి గరికపాటి రాజారావు అని అభ్యుదయ రచయితల సంఘం నేత గోలి సీతారామయ్య అన్నారు. గరికపాటి 61వ వర్ధంతిని పురస్కరించుకుని మంగళగిరి సీపీఐ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ప్రజానాట్య మండలి ప్రతి నిధులు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సాంఘీక నాటకాల ద్వారా అనేక మంది ప్రతిభావంతమైన కళాకారులను నాటక రంగానికి పరిచయం చేసిన ఘనత గరికపాటికి దక్కుతుందన్నారు. గరికపాటి స్ఫూర్తితో ప్రజోపయోగమైన కళలకు జీవం పోయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఎంపీడీవో ఆదినారాయణ, సీపీఐ ఏరియా కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, ప్రజానాట్య మండలి నాయకులు కంచర్ల కాశయ్య, కారుమంచి రామారావు, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, జాలాది జాన్‌బాబు, సురేష్, గంజి వెంకయ్య, కాకర్ల నరసింహారావు, బూసి గోవింద రాజు తదిత రులు పాల్గొన్నారు.



రాజారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ప్రజానాట్య మండలి ప్రతినిధులు



ప్రకాశం బ్యారేజి నుండి దిగువకు విడుదల అవుతున్న వరదనీరు

ప్రకాశం బ్యారేజి వద్ద మళ్లీ పెరుగుతున్న వరద ఉధృతి

- మొదటి ప్రమాద హెచ్చరిక జారీ
- దిగువకు 4 లక్ష 68వేల 720 క్యూసెక్కులు
- డెల్టా కాలువలకు 202 క్యూసెక్కులు

తాడేపల్లిటౌన్, సెప్టెంబరు 8: ప్రకాశం బ్యారేజి వద్ద మళ్లీ వరద ఉధృతి పెరుగుతోంది. వారం రోజుల క్రితం ఉగ్రరూపం దాల్చిన కృష్ణానది తీర ప్రాంతాలను ముంపునకు గురి చేసింది. రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో వరద ఉధృతి క్రమేపి పెరుగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టుతోపాటు మున్నేరు, కీసర, వెలగలేరు, తదితర ప్రధాన వాగుల నుంచి ఆదివారం రాత్రికి 4లక్షల 68వేల 922 క్యూసెక్కుల వరద నీరు ప్రకాశం బ్యారేజి వద్దకు చేరుతున్నట్టు నీటిపారుదల శాఖ జేఈ దినేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 13.3 అడుగుల నీటి మట్టం కొనసాగుతుండగా మొత్తం 70 గేట్లను పూర్తిగా ఎత్తి దిగువకు 4లక్షల 68 వేల 720 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు 202 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు జేఈ తెలిపారు. ప్రకాశం బ్యారేజికి వరద ఉధృతి పెరగడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. దిగువ నది ప్రాంత వాసులు, లంక భూముల రైతులు అందరూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో రోజూ తిరుపతి లడ్డూలు

తుళ్లూరు, సెప్టెంబరు 8: ప్రతి రోజూ తిరుమల తిరుపతి లడ్డూలను వెంకటపాలెం వెంకటేశ్వర స్వామి ఆలయంలో పంపిణీ చేస్తామని సూపరింటెండెంట్ మల్లికార్జునరావు తెలిపారు. రాష్ట్రం వ్యాప్తంగా ఉన్న టీటీడీ ప్రధాన ఆలయాల్లో సోమవారం నుంచి తిరుపతి వెంకటేశ్వరస్వామి లడ్డూలు భక్తులకు అందుబాటులో ఉంచుతున్నట్టు తెలిపారు. విజయవాడ, విశాఖపట్నం వేంకటేశ్వర ఆలయాలతో పాటు వెంకటపాలెం ఆలయంలో లడ్డూ రూ.50లకు భక్తులకు అందిస్తామని చెప్పారు. ఇంతకు ముందు రెండో శనివారం మాత్రమే లడ్డూలు అందుబాటులో ఉండేవన్నారు. ఇప్పుడు రోజూ అందుబాటులో ఉంటాయన్నారు.

వరద బాధితులకు ఆహారం, దుప్పట్ల పంపిణీ



బాధితులకు ఆహారం, దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఉప్పుటూరి చిన్నరాములు

వట్టిచెరుకూరు, సెప్టెంబరు 8: మానవసేవే మాధవ సేవగా తోటి వారికి అండగా తనవంతు సహకారం అందించాలనే ఉద్దేశంతో పుల్లడిగుంట గ్రామానికి చెందిన ఉప్పుటూరి రామ్‌చౌదరి విజయవాడలోని వరద బాధితులకు చేయూతనందించారు. నిరాశ్రయులైన వరద బాధితులకు తన తండ్రి ఉప్పుటూరు చిన్నరాములు సేవా ట్రస్టు ద్వారా సమకూర్చిన పులహోర ప్యాకెట్‌లు, బిస్కెట్లు, దుప్పట్లు, పండ్లను శనివారం ఉప్పుటూరి చినరాములు అందించారు.

తూముకు ఆటోమేటిక్ షట్టర్ ఏర్పాటు చేయాలి

తాడేపల్లి, సెప్టెంబరు 8: ఉండవల్లి కరకట్ట వద్ద ఉన్న వెంకటపాలెం మంతెన సత్యనారాయణరాజు ఆశ్రమం వద్ద కరకట్టకు గతంలో ఒక డ్రైనేజి తూము ఉందని.. ఆటోమేటిక్ షట్టర్ పాడయిందని, రాజధాని రైతు సంఘం అధ్యక్షుడు ఈ ఈశ్వర్‌రెడ్డి అన్నారు. ఆ షట్టర్ పాడవడం వల్ల కృష్ణానది వరద ఉధృతంగా రావడం వల్ల పొలాల మీదకు వరద వచ్చిందని తూమూ పూడ్చడానికి 24గంటల సమయం పట్టిందని తద్వారా రాజధాని వైపు వరద రాకుండా ఆపగలిగారని, ఈశ్వర్‌రెడ్డి అన్నారు. అధికార గణం అలాంటి పరిస్థితులు మళ్లీ రాకుండా ఉండాలంటే వెంటనే ఆ తూము వద్ద ఆటోమేటిక్ షట్టర్ ఏర్పాటు చేయాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.



తూము వద్ద నీరు పారుతున్న దృశ్యం



అన్నవరంలంకలో నిత్యావసరాలను పంపిణీ చేస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సతీమణి డాక్టర్ శ్రీరత్న

వరద బాధితులు అధైర్య పడొద్దు

● కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సతీమణి డాక్టర్ శ్రీరత్న

కొల్లిపర, సెప్టెంబరు 8: వరద బాధితులు అధైర్య పడవద్దని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తప్పకుండా ఆదుకుంటాయని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సతీమణి డాక్టర్ శ్రీరత్న భరోసా ఇచ్చారు. ఆదివారం మండల పరిధిలోని కొత్తూరు లంక, అన్నవరంలంక, మునగపల్లిలంక, బొమ్మువానిపాలెం వరద బాధితులను స్థానిక నాయకులతో కలిసి ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీరత్న మాట్లాడుతూ వరద కారణంగా రైతులు భారీగా నష్టపోయినట్లు తమ దృష్టికి తీసుకువచ్చిందని, బాధిత రైతులను ఆదుకోవటం కోసం కూటమి ప్రభుత్వం ఇప్పటికే చర్యలను ప్రారంభించిందని, పంటనష్టం అంచనాలు సిద్ధంచేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారని అన్నారు. అలాగే పెమ్మసాని ఫౌండేషన్ కూడా అండగా ఉంటుందని తెలిపారు. అనంతరం పెమ్మసాని ఫౌండేషన్ తరపున నిత్యావసరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సిద్ధార్థ, ఎంపీడీవో విజయలక్ష్మి, టీడీపీ మండల అధ్యక్షుడు భీమవరపు చినకోటిరెడ్డి, టీడీపీ తెలుగురైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వంగా సాంబిరెడ్డి, సర్పంచ్ కొల్లి రజని, నాయకులు ఉయ్యూరు శ్రీనివాసరెడ్డి, ఆలపాటి వెంకటేశ్వరరావు, బొల్లు యోగానందచటర్జీ, తాతా అంజనేయులు, పందిపాటి నల్లయ్య, తోడేడి రవి, తోడేటి దాసు, కొల్లి శివరామిరెడ్డి, కౌసల్య, అరవపల్లి అప్పయ్య, శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు రైల్వే మజ్దూర్ చేయూత

తెనాలి క్రైం, సెప్టెంబరు 8: వరద బాధిత కుటుంబాలకు సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ తెనాలి శాఖ చేయూతనిచ్చింది. వరద బాధితులకు దుప్పట్లు, వాటర్ బాటిల్స్, ఇతర ఆహార పదార్థాలను ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూనియన్ సెక్రటరీ రవిబాబు, ఇతర సభ్యులు నరేష్, ప్రసన్న, శివరామకృష్ణ, నవీన్, నరేష్, బాషా తదితరులు పాల్గొన్నారు.

● కొల్లిపర, సెప్టెంబరు 8: కృష్ణానది పరివాహక లంక ప్రాంతాల్లోని వరద బాధితులకు దాతలు అండగా నిలిచారు. అన్నవరంలంక, కొత్తూరులంక, ఈపూరులంక, చిలుమూరు లంక తదితర గ్రామాల్లో 450 వరద బాధిత కుటుంబాలకు ఆదివారం తెనాలి మానవత స్వచ్ఛంద సంస్థ చైర్మన్ కొలసాని రాంచంద్, అధ్యక్షుడు ఓంకార్ ప్రసాద్ నిత్యావసరాలను పంపిణీ చేశారు. ఆదివరంగా పలు పాల సొసైటీల ఆధ్వర్యంలో బొమ్మువానిపాలెం వరద బాధిత కుటుంబాలకు పాల పాకెట్లు, 30 బస్తాల పశువుల దాణా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంగం డెయిరీ సూపర్‌వైజర్ వెంకట్రావు, హనుమాన్‌పాలెం పాలకేంద్ర అధ్యక్షుడు పాలడుగు శ్రీనివాసరావు, కార్యదర్శులు బొమ్మ కోటిరెడ్డి, భీమవరపు శేషిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



వరద బాధితులకు నిత్యావసరాలను పంపిణీ చేస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ రాంచంద్

సామాజిక సేవకుడు శివశంకర్‌కు పురస్కారం

తెనాలి అర్బన్, సెప్టెంబరు 8: సామాజిక సేవలు అందిస్తున్న తస్వీర్ శివశంకర్‌కు భరద్వాజ రుషి పురస్కారం అందింది. పట్టణంలో పలు సంఘాలు స్థాపించి రక్తదానం, అన్నదానం, అనాథ శవ దహన సంస్కారం, విద్యార్థులకు సాయం వంటి సేవా కార్యక్రమాలను శివశంకర్ నిర్వహిస్తున్నారు. ఆయన సేవలను గుర్తించిన భట్టిప్రోలుకు చెందిన సాధన మండలి ఆశ్రమం రుషిపంచమి వేడుకల్లో భరద్వాజ రుషి పురస్కారంతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనను గడ్డిపాటి శ్రీనివాసరావు, వెంకటేశ్వర గుప్తా, భానుప్రసాద్, రమణయ్య తదితరులు అభినందించారు.



సినీనటి దివంగత భానుమతి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అకాడమీ సభ్యులు

భానుమతి నటన సజీవం: మువ్వా

తెనాలి అర్బన్, సెప్టెంబరు 8: సినీ రంగంలో భానుమతి పోషించిన పాత్రలు ఇప్పటికీ సజీవంగా కనిపిస్తాయని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మువ్వా సత్యనారాయణ తెలిపారు. స్థానిక కవిరాజు పార్కులో శనివారం తెనాలి రామకృష్ణ అకాడమీ ఆధ్వర్యంలో భానుమతి శత జయంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చైతన్యవేదిక అధ్యక్షుడు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి మాట్లాడుతూ మానుమతి నటిగా, గాయనిగా, రచయితగా, దర్శక, నిర్మాతలుగా బహుముఖ పాత్రలు పోషించారని కొనియాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన సినీ సంగీత విభావరి శ్రోతలను అలరించింది. కార్యక్రమంలో రచయిత వేమూరి నాగరాజ్యలక్ష్మి, రెంటాల జయదేవ్, అయినాల మల్లేశ్వరరావు, వెంపటి సత్యనారాయణ, భారతి, సోమయ్యశాస్త్రి, రత్నయ్య తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ గరికపాటి రాజారావుకు ఘన నివాళి

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 8: కళలతో ప్రజల్లో చైతన్యం తెచ్చిన మహనీయుడు డాక్టర్ గరికపాటి రాజారావు అని ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి ఆకేటి రామారావు కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి వ్యవస్థాపకుడు రచయిత, నటుడు, దర్శకుడు డాక్టర్ గరికపాటి రాజారావు వర్ధంతి ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగింది. డాక్టర్ రాజారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ప్రజా నాట్య మండలి ద్వారా తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రజా చైతన్యాన్ని రాజారావు రగిల్చినన్నారు. వైద్య వృత్తిలో రాణిస్తూనే మరోవైపు కళల ద్వారా ప్రజా చైతన్యానికి కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో గేయ రచయిత దేవరకొండ శ్రీనివాస్, గుంపుల చిట్టిబాబు, మురళి, రాజబాబు, రాజేంద్ర, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాచైతన్యం లక్ష్యంగా రాజారావు ప్రదర్శనలు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 8: ప్రజల్లో చైతన్యమే లక్ష్యంగా రాజారావు ప్రదర్శనలు ఉండేవని అరసం జిల్లా నాయకులు కనపర్తి బెన్‌హర్ తెలిపారు. గాంధీనగర్‌లోని ఇప్టా కార్యాలయంలో ఆదివారం సినీ నటుడు, దర్శకుడు గరికపాటి రాజారావు వర్ధంతి నిర్వహించారు. బొల్లిముంత కృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కళ కళకోసం కాదు ప్రజలకోసమన్న నినాదంతో నాటికలు, నాటకాలు రూపొందించి ప్రదర్శించారని తెలిపారు. ఎంతో మంది నటులను, సంగీత దర్శకులను సినీరంగానికి పరిచయం చేశారని అన్నారు. కార్యక్రమంలో గాయని వీణ, రఘునాథరావు, విజయసారథి, కరీముల్లా, సుందరరామయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు ఆఫ్ ఇండియా ఆవిర్భావ దినోత్సవం

తెనాలి అర్బన్, సెప్టెంబరు 8: పట్టణంలోని గంగానమ్మపేట బ్రాంచ్‌లో బ్యాంకు ఆఫ్ ఇండియా 119వ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ దుర్గాప్రసాద్ కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణంలో బ్యాంక్ ఆఫ్ ఇండియా 55 ఏళ్లుగా ఖాతాదారులకు సేవలు అందిస్తున్నదన్నారు. తమ శాఖలో 18 వేల మంది ఖాతాదారులు, రూ.160 కోట్ల వ్యాపారం జరుగుతుందన్నారు. తక్కువ వడ్డీ రేట్లకే విద్య, వ్యాపార, గృహ, వాహన, పొదుపు సంఘాలకు రుణాలు అందిస్తున్నామన్నారు. సిబ్బంది అంకిత భావంతో పని చేసి ఖాతాదారుల మన్ననలు పొందుతున్నట్లు తెలిపారు.



కేక్ కట్ చేస్తున్న బ్యాంకు ఉద్యోగులు

భక్తి శ్రద్ధలతో వినాయక చవితి



గణేష్‌యూత్ వినాయకచవితి ఉత్సవాల్లో మంత్రిమనోహర్, డీఎస్పీ జనార్దనరావు, మురళి,నాగభూషణం, వేణు తదితరులు

పొన్నూరు టౌన్, చేబ్రోలు, సెప్టెంబరు 8: వినాయక చవితి వేడుకలు శనివారం పొన్నూరు, చేబ్రోలు మండలాల్లో వాడ వాడలా భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పొన్నూరు పట్టణంలోని నిడుబ్రోలు రెల్లి కులస్తుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 72 కిలోల మట్టి గణనాథుడు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. పర్యావరణ పరిరక్షణ కోసం 72 కిలోల మట్టిని సేకరించి సుందర ఆకృతిలో గణనాథుడిని రైలిపేటలో ఏర్పాటు చేశారు. మట్టి గణనాథుడిని వీక్షించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో ఏర్పాటు చేసిన గణనాథుడు సింహాసనంపై కొలువుతీరి భక్తుల పూజలు అందుకున్నారు. పట్టణంలోని ఆంజనేయ స్వామి గుడి సమీపంలో ఎనిమిదవ ఆర్య యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడు ప్రత్యేక పూజలందుకున్నాడు. పొన్నూరు, చేబ్రోలు మండలాల్లోని పలు కూడళ్లలో గణనాథుల విగ్రహాలను పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. పట్టణ శివాలయంలోని సిద్ధి వినాయక ఆలయంలో చవితి వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మండలపరిధిలోని చింతలపూడి విష్ణేశ్వర మందిరం, శైవాలయాల్లో కొలువుతీరిన వినాయకుల ఆలయాలు నిడుబ్రోలు వినాయకుడి గుడిలో చవితి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన గణనాథుని నిమజ్జనం ఆదివారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వేలం పాటలో రూ.38 వేలకు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బోటి శెట్టి రోశయ్య గుప్తా, కోట శ్రీనివాసరావు, కోమూరి అరవింద్ దక్కించుకున్నారు. స్వామి వారి వస్త్రాలను బూర్ల వెంకటేశ్వరరావు దక్కించుకున్నారు.

● తెనాలి అర్బన్, సెప్టెంబరు 8: పట్టణంలో వినాయక చవితిని ప్రజలు శనివారం ఘనంగా జరుపుకున్నారు. పండుగ రోజు ఉదయం దేవుడు శాంతించడంతో పత్రి, పూలు, పండ్లు అమ్మేవారు, కొనేవారికి ఇబ్బందులు ఎదురు కాలేదు. విజయవాడ రోడ్డులో 60 అడుగుల భారీ వినాయకుని విగ్రహం వద్ద చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. గంగానమ్మపేటలో గణేష్ మెడికల్ కమిటీ ఆధ్వర్యంలో కోలకతా నుంచి తెప్పించిన ఐక మట్టి వినాయకుడిని ఏర్పాటు చేశారు. ఈ వినాయకునిపై పచ్చిగడ్డి మొలవడం ప్రత్యేక ఆకర్షణ. పాత బస్టాండ్ సెంటర్‌లో సిద్ధి విఘ్నేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. మారీసుపేటలోని శివాలయంలోని విఘ్నేశ్వరుడు, రామలింగేశ్వరపేట సెంటర్ ఫుట్ల రాఘవయ్య రైస్ మిల్లు వద్ద 14 అడుగుల వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గుంటూరు కోటేశ్వరరావు, కౌన్సిలర్లు తాడిబోయిన రమణయ్య, సంజీవరెడ్డి, మాజీ కౌన్సిలర్ వాసు, పసి, ఆదివారం భక్తులకు అన్నదానం చేశారు.

● తెనాలి రూరల్: వినాయక చవితి ఉత్సవాలతో తెనాలి ప్రాంత మంతా ఆధ్యాత్మికశోభ వెల్లివిరిసిందని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే నాదెండ్ల మనోహర్ అన్నారు. శనివారం వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని చెంచురు వారి వీధిలో వర సిద్ధి వినాయకయూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చవితి వేడుకల్లో మంత్రి మనోహర్, డీఎస్పీ జనార్దనరావు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని అంగలకుదురు గణేష్‌యూత్ ఆధ్వర్యంలో 22వ ఏటా వినాయక చవితి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. శనివారం స్వామివారికి పూజాదికార్యక్రమాలు అనంతరం గ్రామోత్సవం అంగరంగవైభవంగా నిర్వహించారు. రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి, తెనాలి ఎమ్మెల్యే నాదెండ్ల మనోహర్, డీఎస్పీ జనార్దనరావులు ముఖ్య అతిథులు పాల్గొని గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. గణేష్‌యూత్ కన్వీనర్ డీవీడీతేజ వీరవల్లిమురళి, బొద్దులూరివేణు, కసగాలనాగభూషణం ఇతర సభ్యులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో విగ్రహాలకు నిమజ్జనం

కొల్లిపర, సెప్టెంబరు 8: మండలంలో వినాయకచవితి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గణనాథుడిని ప్రత్యేకంగా అలంకరించి అత్యంత వైభవంగా పూజలు నిర్వహిస్తున్నారు. ఆదివారం వల్లభాపురం, మున్నంగి, తూములూరు, దావులూరు, చక్రాయపాలెం, అత్తోట, హనుమాన్‌పాలెం తదితర గ్రామాల్లోని వినాయక మండపాల వద్ద భక్తులు పూజలు చేశారు. కొల్లిపర, తూములూరు, చక్రాయపాలెం, అత్తోట తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలను కృష్ణానదిలో నిమజ్జనం చేశారు.

పేదలకు అన్నదానం

తెనాలి, మారీసుపేట సెప్టెంబరు 8: స్థానిక ముత్తింశెట్టిపాలెం పోతురాజు కాలనీ పల్లాపాటి వీధిలో ఆదివారం పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని శ్రీగణేష్ యూత్ కమిటీ సభ్యులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యదర్శి నమ్మలు పల్లాపాటి నాగరాజు పాల్గొని గణేష్‌నికి ప్రత్యేక పూజలను నిర్వహించారు.



కొల్లిపరలో వినాయక విగ్రహాన్ని ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

నాట్కో చైర్మన్ సోదరుడు రామకృష్ణారావు మృతి

● ఎమ్మెల్యే నరేంద్రకుమార్ నివాళి

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 8: మండల పరిధిలోని గోళ్లమూడిపాడు గ్రామానికి చెందిన డాక్టర్ నన్నపనేని రామకృష్ణారావు (81) శనివారం మృతి చెందారు. నాట్కో సంస్థ చైర్మన్ డాక్టర్ నన్నపనేని వెంకయ్యచౌదరికి రామకృష్ణారావు సోదరుడు. ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ శనివారం రామకృష్ణారావు మృతదేహాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా గోళ్లమూడిపాడుకు రామకృష్ణారావు చేసిన సేవలను మననం చేసుకున్నారు. అనంతరం నన్నపనేని వెంకయ్య చౌదరిని పరామర్శించి సానుభూతి తెలియజేశారు. అలాగే రామకృష్ణారావు కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాదల వెంకటేశ్వరావు, బొర్రు రామారావు, బండ్లమూడి బాబూరావు తదితరులతో పాటు పలువురు ప్రముఖులు నివాళి అర్పించిన వారిలో ఉన్నారు.



డాక్టర్ నన్నపనేని రామకృష్ణారావుకు నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్

పేకాట స్థావరంపై దాడి

తెనాలి రూరల్, సెప్టెంబరు 8: పేకాట స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. మండలంలోని జగ్గడిగుంటపాలెంలో ఓ వ్యక్తి ఇంట్లో పేకాడుతున్నారని అందిన సమాచారంతో దాడులు నిర్వహించగా 9 మంది జూదరులను అదుపులోకి తీసుకుని వారి వద్ద ఉన్న రూ. 25,200 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

ఘనంగా ఫిజియోథెరపీ దినోత్సవం

తెనాలి అర్బన్, సెప్టెంబరు 8: ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం పట్టణంలో ఫిజియోథెరపీ అసోసియేషన్ నేతలు ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు కంచం వెంకటకుమార్ మాట్లాడుతూ ఫిజియోథెరపీలో ఆధునాతన చికిత్సలు అందుబాటులోకి వచ్చాయని, న్యూరో, ఆర్థో, పీడియాట్రిక్ విభాగాల్లో నిష్ణాతులైన ఫిజియోథెరపిస్టులు పట్టణంలో ఉన్నారని, వారి సేవలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో శరత్‌కుమార్, విష్ణుప్రియ, రవికాంత్, విజయసాగర్, సందీప్, భానుశ్రీ తదితరులు పాల్గొన్నారు.



సంగంజాగర్లమూడి లాకుల వద్ద నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్, సీఐ శ్రీనివాసరావు

జిల్లాలో పలువురు ఎస్ఐల బదిలీ

గుంటూరు, సెప్టెంబరు 8: జిల్లాలో పలువురు ఎస్‌లను బదిలీ చేస్తూ ఆదివారం జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన ఎస్ఐ వివరాలు ఇలా ఉన్నాయి. తెనాలి రూరల్ ఎస్సై 2 పి కోటేశ్వరరావును కొల్లిపరకు బదిలీ చేశారు. కంట్రోల్ రూమ్‌లో విధులు నిర్వహిస్తున్న జి శివకృష్ణారెడ్డిని కొల్లూరు ట్రాఫిక్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. జిల్లా వీఆర్‌లో ఉన్న ఆర్ రవీంద్రారెడ్డిని తాడేపల్లి ట్రాఫిక్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. నల్లపాడు పిఎస్‌లో ఉన్న పి బాబూరావును తుళ్లూరు స్టేషన్‌కు, ఆదేవిధంగా వీఆర్‌లో ఉన్న కే ఏడుకొండలును కూడా తుళ్లూరు స్టేషన్‌కు బదిలీ చేశారు. వీఆర్‌లో ఉన్న జాజుల శ్రీనివాసరావును తాడేపల్లి స్టేషన్‌కు, అదేవిధంగా స్పెషల్ బ్రాంచ్ లో ఉన్న టి నరేంద్ర కుమార్‌ను కూడా తాడేపల్లికి బదిలీ చేశారు. ఆదేవిధంగా తాడేపల్లి ట్రాఫిక్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న ఎం సుబ్బారావును కూడా తాడేపల్లికి బదిలీ చేశారు. ప్రస్తుతం తాడేపల్లి స్టేషన్లో అటాచ్‌మెంట్లో ఉన్న పి భాగ్యారావును పాతగుంటూరు స్టేషన్‌కు బదిలీ చేశారు. అదేవిధంగా వీఆర్ లో ఉన్న ఎం కోటేశ్వరావును ఈస్ట్ ట్రాఫిక్ స్టేషన్‌కు బదిలీ చేశారు. డీసీఆర్‌బీలో ఉన్న డి శ్రీధర్‌ను వెస్ట్ ట్రాఫిక్ కు బదిలీ చేశారు. ప్రమోషన్ అనంతరం వీఆర్ లో ఉన్న కే ఆదినారాయణ సంగం జాగర్లమూడి స్టేషన్ కు అదే విధంగా పేక ఇబ్రహీంను తెనాలి 3 టౌన్ స్టేషన్ కు, అలాగే పేక్ బాబావలిని కంట్రోల్ రూమ్ కు బదిలీ చేస్తూ ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాలు ఇచ్చారు.

నిమజ్జనాల్లో అప్రమత్తంగా ఉండాలి

● ఎస్పీ సతీష్‌కుమార్

తెనాలి రూరల్, సెప్టెంబరు 8: వినాయక నిమజ్జన సందర్భంలో భక్తులు, నిర్వాహకులు ఎలాంటి ప్రమాదం జరగకుండా అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని ఎస్పీ సతీష్‌కుమార్ పోలీస్ యంత్రాంగాన్ని ఆదేశించారు. నిమజ్జన ప్రాంతమైన మండలంలోని సంగంజాగర్లమూడి కొమ్మమూరు కాలువ లాకుల ప్రాంతాన్ని ఆదివారం ఎస్పీ సతీష్‌కుమార్ పరిశీలించారు. భారీ వర్షాల కారణంగా కాలువ ఉధృతంగా ప్రవహిస్తుండటంతో నిమజ్జన సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా చేపట్టవలసిన చర్యలపై రూరల్ సీఐ బెల్లం శ్రీనివాసరావు, ఎస్ఐ ప్రతాప్‌కుమార్‌లకు ఎస్పీ పలు సూచనలు చేశారు. మహిళలు, పిల్లలు నిమజ్జనం వద్దకు రాకుండా చూడాలని, కాలువలోకి దిగకుండా భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధితులకు అండగా డిప్యూటీ సీఎం

● నేడు పంచాయతీకి రూ.లక్ష విరాళం చెక్కుల పంపిణీ

తెనాలి రూరల్, సెప్టెంబరు 8: వరద బాధితులకు అండగా జనసేన అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కల్యాణ్ అండగా నిలిచి రూ.4 కోట్లు ప్రకటించారని జనసేన పార్టీ నాయకుడు, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ తోట కూర వెంకటరమణారావు అన్నారు. ఆదివారం తెనాలి జనసేన పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో వరద ముంపునకు గురైన 400 గ్రామ పంచాయతీలకు ఒక్కొక్క పంచాయతీకి రూ.1లక్ష చొప్పున మొత్తం రూ. 4కోట్లు సాయం ప్రకటించి పెద్ద మనస్సును చాటుకున్నారని కొనియాడారు.

గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని ఆయా పంచాయతీ సర్పంచ్‌లకు తెనాలిలోని సూరిశ రామకోటేశ్వరరావు కల్యాణమండపంలో సోమవారం సాయంత్రం రూ.1 లక్ష చెక్కులు అందించే దుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఈ కార్యక్రమానికి వివిధ శాఖల మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు హాజరై చెక్కులు అందజేస్తారని తెలిపారు. సమావేశంలో తెనాలి నియోజకవర్గ ఆర్గనైజింగ్ సెక్రటరీ పసుపులేటి శ్రీకృష్ణ, జనసేన పార్టీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ బండారు రవికాంత్, గుంటూరు జిల్లా ఉపాధ్యక్షుడు ఇస్మాయిల్, కౌన్సిలర్లు జైపాల్, దాసరి వరలక్ష్మి, ఎంపీటీసీలు అమ్మిశెట్టి హరికృష్ణ, పసుపులేటి వెంకటరమణ, గుంటూరి విజయలక్ష్మి, నాయకులు డీవీసెస్ సాయి జాకీరహుస్సేన్, జావీద్, సాయి మోహన్, శ్రీను, రాంబాబు, ఆళ్ళేశ్వరరావు, బెల్లపు యశ్వంత్, తులసి, సత్యనారాయణ, రవిని, సాయి, శివనాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆహారం పంపిణీ

తెనాలి, మారీసుపేట సెప్టెంబరు 8: వరద బాధితులకు జేఎంజే కళాశాల యూత్ రెడ్‌క్రాస్ యూనిట్ రెడ్ రిబ్బన్ క్లబ్ విద్యార్థినులు ఆహారం పంపిణీ చేశారు. ఆదివారం జేఎంజే కళాశాల యూత్ రెడ్‌క్రాస్, రెడ్ రిబ్బన్ క్లబ్ విద్యార్థినులు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ మేరీ శారద ఆధ్వర్యంలో పెదకాకాని, నంబూరు ఎస్టీఆర్ నగర్‌లోని 300ల వరద బాధిత కుటుంబాలకు ఆహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిస్టర్ అమూల్ మేరీ, పోగ్రాం కన్వీనర్ డాక్టర్ పాటిబండ్ల హేమలత, డాక్టర్ నిర్మల జ్యోతి, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ అరుణ పుజాత, ఎంఎస్ ప్రవీణ, జేఎంజే యూత్ రెడ్‌క్రాస్, రెడ్ రిబ్బన్ క్లబ్ విద్యార్థులు, ఎన్‌సీసీ విద్యార్థినులు పాల్గొన్నారు.

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుదాం

● పట్టణ మున్సిపల్ కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట సెప్టెంబరు 8: వినాయక చవితి పండుగ నిర్వహిస్తున్న మండప నిర్వాహకులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. స్థానిక బోసురోడ్డులోని స్వరాజ్ టాకీసు సెంటర్‌లో శనివారం సాయంత్రం వినాయక చవితికి నిర్వహించే మండపాలను పరిశీలించారు. ఆదివారం కూడా పూజల అనంతరం చెత్తా చెదారం మిగిలిన పత్రి తదితర వ్యర్థాలను మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పరిశీలించి శుభ్రం చేసేందుకు తగు చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాల మేరకు పట్టణంలో పారిశుధ్య పనుల ప్రత్యేక శ్రద్ధ పెట్టామన్నారు. వినాయక చవితి పండుగ సందర్భంగా వినాయక మండపాల నిర్వాహకులు పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు.

గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే వరదలు

● పంట కాల్వలకు మరమ్మతులేవీ? ● ఎమ్మెల్యే ధూళిపాళ్ల



మన్నవలో నీట మునిగిన వరి పైరును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్ తదితరులు

పొన్నూరు టౌన్, చేబ్రోలు, సెప్టెంబరు 8: వైసీపీ ప్రభుత్వంలో కాల్వలకు మరమ్మతులు నిర్వహించకపోవటం వల్లనే పొలాలు నీట మునిగి రైతులకు అపార నష్టం వాటిల్లిందని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఆరోపించారు. శనివారం చేబ్రోలు మండలంలోని గొడవర్రు, శలపాడు, పొన్నూరు మండలంలోని జూపూడి, మన్నవ, దొప్పలపూడి గ్రామాల్లో నీట మునిగిన వరి పైరును నరేంద్ర కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ పంట పొలాలు నీట మునిగి వారం దాటాయని పంటను కాపాడుకోలేని పరిస్థితులు ఏర్పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. పంట కాల్వలు, మురుగు కాల్వల ద్వారా వచ్చిన వరద పంటను ముంచేసిందని వాపోయారు. ఈ సందర్భంగా నరేంద్రకుమార్ మాట్లాడుతూ రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని హామీఇచ్చారు. పంట, మురుగు కాల్వలకు మరమ్మతులు నిర్వహించకుండా వదిలివేయటం వల్లనే రైతులు తీవ్ర ఆస్తులు ఎదుర్కొంటున్నారన్నారు. రైతు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పొన్నూరు, చేబ్రోలు తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.